నవతెలంగాణ 1
కరీంనగర్
గురువారం 2 మార్చి 2023

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన 'వెంకన్న' ఆలయం

నేటి నుండి 8వ తేదీ వరకు ఉత్సవాలు
ఉత్సవాల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు
వేలాదిగా తరలిరానున్న భక్తులు




నవతెలంగాణ-గంగాధర:
కోరిన కోర్కెలు తీర్చే వెంకన్నగా ప్రతీతి చెందిన గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. తిరుమల తిరుపతి దేవాలయ ముఖ ద్వారాన్ని పోలి ఉన్న ఇక్కడి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పశ్చిమాభి ముకుండై స్వామి వెలిశారు. కాకతీయుల కాలం నుండి నేటి వరకు క్రమం తప్పకుండా ప్రతి యేటా హోళీ పర్వదినంకు ఆరు రోజులు ముందు నుండే బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఆరంభం అవుతాయి. ఈ యేడు జరుగనున్న ఉత్సవాలు నేటి నుండి ప్రారంభమై వారం రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్వకోట శ్రీనివాస రావు ఆధ్వర్యంలో జరుగనున్న ఈ ఉత్సవాలకు ఆలయం వీధులు, స్వామి వారి ఆలయం విద్యుత్ దీపాలంకరణ, పచ్చ తోరణాలతో కొత్త శోభను సంతరించుకుంది. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, భక్తుల దర్శనాల క్యూలైన్లు, తాగునీటి వసతులు, దుకాణ సముదాయాల ఏర్పాట్లు, అన్నదానం, ప్రసాద వితరణ వంటి పలు రకాల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. 'కల్యాణోత్సవం', 'డోలోత్సవం' బండ్లు తిరుగుట, 'రథోత్సవం'లను పురస్కరించుకుని ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరుస్తాయి. గోవింద నామస్మరణలతో మారుమోగుతూ స్వామి వారిని భక్తులు దర్శించుకోనున్నారు.

బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టాలివే ..

2వ తేదీన సేవ, స్వామి ఆలయ ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. 3న ఎదురుకోల్లు, గరుడముద్దలు, 'స్వామి కల్యాణోత్సవం' కన్నుల పండువగా జరుగనున్నాయి. 4న బేరిపూజ, హవణం, బలిహరణం, ప్రముఖ కవి వాగ్గేయకారుడు రుక్మాభట్ల నరసింహస్వామి గేయ రామాయణం, 5న సదస్యం, వేదగోష్టి, సత్యం కీడోర్డు శంకరన్న తబల, గర్శకుర్తి భక్తులతో సంగీత కార్యక్రమం చేపట్టనున్నారు. 6వ తేదీన హనుమత్ వాహనంపై 'డోలోత్సవం' ప్రముఖ హరికథ కళాకారిణి వావిలాల నాగమణి హరికథ, ఉప్పరమల్యాల భక్తులతో భజన కార్యక్రమం కొనసాగనుంది. 7న హవణం, బలిహరణం, సాంస్కృతిక కార్యక్రమం, సాయంత్రం బండ్లు తిరుగుట, శేషవాహనంపై 'డోలోత్సవం' అత్యంత వైభవంగా జరుగనున్నాయి. 8వ తేదీన ఉదయం 'రథోత్సవం' శేష హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం, తాడిజెర్రికి చెందిన ఈర్ల మహిపాల్ ఒగ్గు కళాబృందం ఒగ్గు కళా ప్రదర్శన, మహిళల కోలాటాలు, రాత్రి భజన కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

పోలీసుల భారీ బందోబస్తు

ప్రతి యేటా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లోని అనేక ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల కట్టడి, క్యూలన్ల నిర్వహణ, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గంగాధర ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. అనేక ప్రాంతాల నుండి తరలివచ్చే ట్రాక్టర్లు, ఎండ్ల బండ్లు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేపడతారు. బండ్లు తిరిగే కార్యక్రమంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తారు.

ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్‌కు అభినందనలు



నవతెలంగాణ-కరీంనగర్:
నగరంలోని స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ ఇటీవల జాతీయ స్థాయి భారత్ భాషా భూషణ్ అవార్డును స్వీకరించడం పట్ల కళాశాల విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ అభినందించారు. ఇటు కళాశాలలో స్వయం ప్రతిపత్తి, న్యాక్ ఉన్నత శ్రేణి గ్రేడ్‌ను, అటు సాహిత్య రంగంలోను రామకృష్ణ ప్రగతి పథంలో ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ పదోన్నతి పొందిన సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్‌ని పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

యువ సంవాద్ ఇండియా కార్యక్రమం

నవతెలంగాణ-కరీంనగర్: యువ సంవాద్ ఇండియా 2047 కార్యక్రమం యువజన సంఘాల ద్వారా నిర్వహించుచున్నామని కరీంనగర్ నెహ్రూ యువ కేంద్ర ఎం.వెంకట్ రాంబాబు తెలిపారు. జిల్లాలో మూడు కార్యక్రమాలు ఏప్రిల్ 1 నుంచి మే 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని నిర్వహించడానికి కరీంనగర్ జిల్లాలోని యువజన సంఘాలు, ఎన్జీఓలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 14 దరఖాస్తులకు చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తు పొందడానికి నెహ్రూ యువ కేంద్ర కరీంనగర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

పారమిత విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం


మెరిట్ సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

నవతెలంగాణ-కరీంనగర్: ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన 18వ జాతీయ స్థాయి జంబూరి క్యాంపుకు 12 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు అర్హత సాధించారని పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ కమలాకర్ తెలిపారు. జాతీయ స్థాయి జంబూరి క్యాంపులో భాగంగా ఫిబ్రవరిలో కరీంనగర్ జిల్లా నుంచి 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా పారమిత పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు, గైడ్ కెప్టెన్ రజిత ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో క్యాంపుకు ఎంపికై, మార్చ్ ఫాస్ట్, జానపద నృత్యాలు, బీపీ ఎక్సర్సయిజ్, క్యాంప్ క్రాఫ్ట్, రంగవల్లి, డ్రాయింగ్, శారీరక సామర్థ్య పరీక్షలు తదితర పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజయాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల అధినేత డాక్టర్ ఇ.ప్రసాద రావు మెరిట్ సర్టిఫికెట్స్ ప్రధానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రస్మిత, అనుకర్ రావు, వినోద రావు, హనుమంత రావు, ప్రిన్సిపాల్స్ ఆనంద్ కమలాకర్, ప్రశాంత్, కవిత, ఎస్ఓడీ తిరుపతి రావు, గైడ్ కెప్టెన్ రజిత, స్కౌట్స్ మాస్టర్ శ్రీను నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల నెత్తిన గ్యాస్ భారం

- పెరిగిన 'గ్యాస్ సిలిండర్' ధరలు
- డొమెస్టిక్‌పై రూ.50,
- కమర్షియల్‌పై రూ.340 పెంపు
- లబోదిబోమంటున్న
- గ్యాస్ వినియోగదారులు



నవతెలంగాణ-గంగాధర:
ఇప్పటికే పెనుభారంగా మారిన గ్యాస్ సిలిండర్ల ధరలు మరోసారి పెరిగాయి. గ్యాస్‌బండ భారాన్ని మోయలేక సతమతం అవుతున్న పేదలపై కేంద్రం మరోసారి భారం మోపింది. మూలిగె నక్కపై తాటి పండు పడ్డ చందంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు గ్యాస్ సిలిండర్లను వదిలి పొయ్యిలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెల వరకు ఒక్కో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ రూ. 1125 ఉండగా, ప్రస్తుతం రూ. 50 పెరిగి 1175 రూపాయలకు చేరింది. అదేవిధంగా కమర్షి యల్ సిలిండర్ ధర రూ. 2010 ఉండగా, ప్రస్తు తం రూ. 340 పెరుగుదలతో 2350 రూపాయ లకు చేరింది. ప్రజలపై ప్రతి నెల గ్యాస్ భారం పెరుగుతుండడంతో గ్యాస్ వినియోగదారులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కేంద్రం ప్రకటించిన సబ్సిడీ గ్యాస్ వినియోగదారుల బ్యాంక్ ఖాతాలకు చేరకపోగా, పెంచిన సిలిండర్ ధరను వెచ్చించి కొనుగోలు చేయలేక దిగాలు పడుతున్నారు. కరీంనగర్ జిల్లాలో 21 ఎల్‌పీజీ ఏజెన్సీలు ఉండగా, మొత్తం 312206 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెల పెద్ద మొత్తంలో సిలిండర్ గ్యాస్ వినియోగం ఉంది. సిలిండర్ల ధర పెంపుతో జిల్లా ప్రజలపై కోట్ల భారం పడుతోంది. అసలే సిలిండర్ల ధరలు పెరిగి గృహ, చిన్న తరహా వ్యాపారులు ఇబ్బంది పడుతుంటే డోర్ డెలివరీ పేరిట వినియోగదారుల వద్ద రూ. 30 అదనంగా వసూలు చేస్తున్నారు.

అటకెక్కుతున్న సబ్సిడీ సిలిండర్లు

కేంద్ర ప్రభుత్వం ఓ వైపు గ్యాస్ ధరలు పెంచుతూ మరో వైపు సబ్సిడీ సిలిండర్ గ్యాస్ కనెక్షన్లను అందిస్తున్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలకు కేంద్రం సబ్సిడీ గ్యాస్ కనెక్షన్ల పేరిట ఉజ్వల యోజన పథకం కింద సిలిండర్లను అందిస్తుంటే, రాష్ట్రం గతంలో దీపం కనెక్షన్లను అందించింది. అయితే ఈ సబ్సిడీ సిలిండర్ కనెక్షన్లు పొందిన పేదలు కేంద్రం నిర్ణయించిన ధర వెచ్చించి కొనుగోలు చేస్తుంటే, బ్యాంకు ఖాతాల్లో జమ కావల్సిన సబ్సిడీ జమ కావడంలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సబ్సిడీ అందక, పెరిగిన ధరలు వెచ్చించి సిలిండర్లను కొనుగోలు చేయలేని పేదలు సిలిండర్లను అటకెక్కించారు.

పేదల కడుపు కొట్టి పెద్దలకు పెడుతున్న కేంద్రం



గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి కేంద్రంలోని బీజేపీ పాలకులు పేదల కడుపు కొడుతున్నరు. ధరలు పెంపుతో పేదోళ్ల కడుపు కొడుతున్న కేంద్రం బడా బాబులకు పెడుతోంది. 2014లో రూ. 400 ఉన్న సిలిండర్ ధర తేవకింతా పెంచుతూ 1175 రూపాయలకు చేర్చింది. అదానీ, అంబానీలకు ప్రజల డబ్బును పంచడానికే కేంద్రంలోని బీజేపీ నేతలు సిలిండర్ల ధరలు పెంచారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన కేంద్రం మరోసారి గ్యాస్ ధరలు పెంచడం వల్ల పేదలు మళ్లీ పొయ్యిలను ఆశ్రయించాల్సిన దుస్థితే ఏర్పడింది. పెంచిన గ్యాస్ ధరలను దించి పేదలు గ్యాస్‌ను వినియోగించాల చూడాలి.

– సుంకె రవిశంకర్, ఎమ్మెల్యే, చొప్పదండి

కేంద్రం పెత్తందారి పోకడలను విడనాడాలి



కేంద్రం అనుసరిస్తున్న పెత్తం దారి పోకడలను విడనాడాలి. ఇప్పటికే పెంచిన గ్యాస్ ధరలే పేదలకు భారంగా మారాయి. దీన్ని గమనించని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పేదలకు పెనుభారంగా మారుతున్నయి. స్వల్పంగా ఉన్న గ్యాస్ సిలిండర్ల ధరలు ప్రతిసారి పెద్ద మొత్తంలో పెంచుతూ వినియోగించలేని స్థితిని కల్పిసుఖంది. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి. లేదంటే పేదల పక్షాన ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయాల్సి వస్తుంది.

– వాసుదేవరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

గ్యాస్‌భారం మోయలేకపోతున్నం



పొద్దంత హోటల్ నడిపితే వచ్చే డబ్బు స్వల్పం. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల వాడకం వల్ల సంపాదించే డబ్బు కొనుగోలుకే పోతుంది. ప్రతి సారి వందల్లోనే సిలిండర్ల ధరలు పెంచుతున్నరు. గ్యాస్ ధరల పెంపు వల్ల హోటల్ నడుపలేక మూసుకునే పరిస్థితి ఏర్పడింది.

– నరుకుల్ల భీమయ్య, హోటల్ యజమాని, గంగాధర చౌరస్తా

గుదిబండగా మారింది



గ్యాస్ బండ మా పాలిట గుది బండగా మారుతోంది. చిన్న చితక పనులు చేసుకుని బతికేటోళ్లం. ప్రతిసారి సిలిండర్ ధరలు పెంచుతుంటే అన్నం, కూరలు వండుకుని, స్నానానికి అవసరమైన వేడినీళ్ల పొయ్యి పెట్టుకుని కాగపెట్టుకుంటున్నం. ఇప్పుడు పెంచిన ధరలతో ప్రతి వంట పొయ్యిపైనే చేసుకోవల్సిందే. ఒక్క గ్యాస్ సిలిండర్ నెల పదిహేను నుండి రెండు నెలలు వస్తుంది. ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్నం.

– కమటం దేవేంద్ర, గృహిణి, గర్శకుర్తి

100 షీ సైబర్ హెల్ప్‌లైన్‌ను ఉపయోగించుకోండి

చొప్పదండి సీఐ గోపతి రవీందర్


మాట్లాడుతున్న చొప్పదండి సీఐ గోపతి రవీందర్

నవతెలంగాణ- చొప్పదండి: అపరిచిత వ్యక్తులు అని అనుమానం ఉంటే వెంటనే 100 షీ సైబర్ హెల్ప్ లైన్‌లకు కాల్ చేయాలని చొప్పదండి సీఐ గోపతి రవీందర్ విద్యార్థినులకు సూచించారు. చొప్పదండి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో చొప్పదండి సీఐ గోపతి రవీందర్, ఎస్ఐ ఉపేంద్ర చారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా భద్రత గురించి, సైబర్ సెక్యూరిటీ హెల్ప్‌లైన్ 100 కాల్స్, షీ టీం, ఫోక్సో కేసుల గురించి వివరించారు. లైంగిక వేధింపులు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. మహిళా భద్రత గురించి అధికారుల నెంబర్లతో కూడిన వాల్ పోస్టర్లను అన్ని విద్యాసంస్థలలో అతికించి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్. స్వాతి, పోలీస్ సిబ్బంది, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రవీందర్ ఎన్నిక


రవీందర్

నవతెలంగాణ-గంగాధర: గంగాధర మండలంలోని గ్రామ కార్యదర్శుల సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా గంగాధర జీపీ కార్యదర్శి జి.సాయిలు, అధ్యక్షుడిగా ఎం.రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎం. జనార్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జె.చంద్రయ్య, కోశాధికారిగా టి.మల్లేశం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అంజయ్య, కార్తీక్, జాయింట్ సెక్రటరీలుగా రాజ్‌కుమార్, జయవాణి, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. పలువురు కార్యదర్శులు ఈసీ మెంబర్లుగా, మిగతా కార్యదర్శులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు సాయిలు, అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ.. గ్రామ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి తోడ్పడుతామని వివరించారు.

ప్రజలు 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్


కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

నవతెలంగాణ-గంగాధర : గ్రామ గ్రామాన ఉచితంగా నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పిలుపునిచ్చారు. గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దృష్టి లోపంతో బాధపడే ప్రతి ఒక్కరూ ఉచితంగా నిర్వహించే వైద్య పరీక్షలు, అందించే అద్దాలను పొందాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని, గ్రామ గ్రామాన వైద్యులు శిబిరాలను నిర్వహిస్తూ వైద్య పరీక్షలు చేస్తూ అద్దాలు అందిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ మేచినేని నవీన్‌రావు, ఎంపీవో జనార్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అలువాల తిరుపతి, రేండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సురభి'లో అలరించిన వీడ్కోలు హంగామా

నవతెలంగాణ-గంగాధర: గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని సురభి కాన్వెంట్ హైస్కూల్‌లో బుధవారం ఆ పాఠశాల టెన్త్ విద్యార్థులు వీడ్కోల్‌ను పురస్కరించుకుని ఆట, పాటలతో హంగామా చేశారు. సినీ, జానపద పాటలపై విద్యార్థిని, విద్యార్థులు నృత్యాలు చేసి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను అలరించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం, హెచ్ఎం వీర నర్సయ్య మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి 10 జీపీఏ సాధించాలని సూచించారు. విద్య ద్వారే ఉన్నత, ఉద్యోగ అవకాశాలు పొందుతారని, ఉన్నత విద్యకు తొలిమెట్టు పదో తరగతేనన్న విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో ఘనంగా 'మనోహరం-2023' వేడుకలు



మాట్లాడుతున్న రమేష్ రెడ్డి

నవతెలంగాణ-తిమ్మాపూర్: మండలంలోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో చేరిన ప్రథమ సంవత్సరం బి.ఫార్మసీ విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరం బి.ఫార్మసీ విద్యార్థులు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ పార్టీ ఏర్పాటు చేశారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఫ్రెషర్స్ పార్టీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేస్తే ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు మేధస్సు చురుకుదనంగా ఉంటుందని చెప్పారు. శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతనంగా తయారవుతున్న డ్రగ్స్, ఫార్మసీ రంగానికి సంబంధించిన టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ.. ఫార్మసీ విద్యార్థులు మందుల నాణ్యత, పంపిణీ చట్టంలో ఉన్న నిబంధనల గురించి అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇంచార్జి గొంటి రమేష్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పలు అభివృద్ధి పనులు ప్రారంభం


తిమ్మాపూర్: 3) పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-తిమ్మాపూర్: మండలంలోని మహత్మనగర్ గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో ఉర్దూ మీడియం స్కూల్లో చేసే అభివృద్ధి పనులను ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్ రెడ్డి, సర్పంచ్ జక్కని శ్రీవాణి రవీందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మడుపు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఎర్రం సాగర్, గూడ తిరుపతి, ఎడ్ల వెంకట్ రెడ్డి, క్యాంప్ ఆఫీస్ ఇంచార్జి నాయిని వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అడిచెర్ల సత్యనారయణ, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మన్నెంపల్లి ఉపసర్పంచ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-తిమ్మాపూర్:
మండలంలోని మన్నెంపల్లి గ్రామ ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ జన్మదిన వేడుకలు అంగన్వాడీ కేంద్రంలో పొన్నం యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకం అరటిపండ్లు, కోడిగుడ్లు, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దరిపెల్లి వేణుకుమార్, సుదగోని సదయ్య, బీనపల్లి సంపత్, గీకురు రమేష్, గొల్ల సాయి, అసాద సాయి, గట్టుగారి నాగేంద్ర, బీనపల్లి రాజు, బీనపల్లి రాకేష్, తునికి రాకేష్, బీనపల్లి అజయ్, గోల్లె గణేష్, పారునంది అభిషేక్ పాల్గొన్నారు.


తిమ్మాపూర్:4) పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

న్యాయ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి


వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కరీంనగర్: యూనివర్సిటీ పరిధి లో ఉన్న న్యాయ కళాశాల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలను గుర్తించి, వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. స్థానిక శాతవాహన యూనివర్సిటీలో యూనివర్సిటీ రిజిస్టర్ వరప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. న్యాయ వృత్తిలో కొనసాగుతున్న న్యాయవాదుల పేర్లు బోధన సిబ్బందిగా చూపిస్తూ బోధన క్లాసులు నిర్వహించకుండా యూనివర్సిటీ నిబంధనకు విరుద్ధంగా న్యాయ కళాశాల నిర్వహిస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకపోయినా నేటి వరకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. బోధన, బోధనేతర సిబ్బందికి పీఎఫ్ కట్టాలని నిబంధన చెపుతున్నా నేటి వరకు పీఎఫ్ కట్టకుండా బోధన, బోధనేతర సిబ్బంది జీవితాలతో చెలగాటమాడుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ నిబంధనకు వ్యతిరేకంగా నడుస్తున్న కళాశాలలను గుర్తించి కళాశాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, యాజమాన్యపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివరాజ్ నాయక్, కృష్ణ, వినోద్, ప్రకాష్ తదితరులున్నారు.

మానేరులో విద్యార్థులకు క్రీడా పోటీలు


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న విద్యాసంస్థల చైర్మెన్ అనంత రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్: కరీంనగర్‌లోని స్థానిక సాయి మానేరు పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారం, చెస్, రన్నింగ్ తదితర క్రీడా పోటీల్లో విద్యార్థులకు పోటీ లు నిర్వహించారు. పోటీల ను మానేరు విద్యాసంస్థల చైర్మెన్ కడారి అనంత రెడ్డి విద్యార్థులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి ప్రతి సంవత్సరం పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి జూడో పోటీలతో పాటు పలు క్రీడల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పేదల నడ్డీ విరుస్తోన్న కేంద్ర ప్రభుత్వం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు



నవతెలంగాణ-కరీంనగర్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్ ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డీ విరుస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు ఆరోపించారు. బుధవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.500లు ఉన్న గ్యాస్ సిలీండర్ ఎనిమిదేళ్ల మోడీ ప్రభుత్వం పలుమార్లు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతుందన్నారు. గతంలో పలుమార్లు డీజిల్, పెట్రోల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను పెంచడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మోడీ మన్‌కి బాత్ అంటే నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద ప్రజల నడ్డీ విరచి గోస పెట్టడమేనా? ప్రజల గోస బీజేపీ భరోసా యాత్ర అంటే ప్రభుత్వ ఆస్తులను అంబానీ, ఆదానీలకు అమ్మడమేనా ఇదేనా మీరిచ్చే భరోసా? అని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించే వరకు బీఆర్ఎస్ ఆందోళన చేపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీల ధర్నా

నవతెలంగాణ-ధర్మపురి : అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజుల సమ్మెలో భాగంగా మొదటి రోజు ధర్మపురి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎదుట అంగన్వాడి ఉద్యోగుల ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర కోశాధికారి కే సునీత , ,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి. జ్యోతి పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని,పెండింగ్ టిఏడిఏలు చెల్లించాలని ఆరోగ్య లక్ష్మి, మెనూ చార్జీలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ,ఎన్ హెచ్ టి ఎస్ ఆన్లైన్ యాప్ ను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవోకు వినతి పత్రం అందజేశారు.


దర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం

నవతెలంగాణ-ధర్మపురి : ధర్మపురి కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేష్‌కుమార్ అధ్యక్షతన పాలకవర్గ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో 1.డిసెంబర్ 2022 నుంచి ఫిబ్రవరి 2023 మాసములు ఆదాయ వ్యయాలు, 2023-24 సంవత్సరపు బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అక్కేనపెల్లి సునీల్ కుమార్, పాలకవర్గ సభ్యులు వీరవేని రాజ మల్లయ్య, గైని మల్లేశం, మైనేని వెంకటి, మామిడి శ్రీనివాస్, చక్రాల శ్రీనివాస్, జంగా శ్రీనివాసు, గాజుల సత్తయ్య పాల్గొన్నారు.

యువత గ్రామ స్థాయిలో సేవాభావం కలిగి ఉండాలి



నవతెలంగాణ-మేడిపల్లి : మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి గ్రామంలో నలంద డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో చివరి రోజు కార్యక్రమంలో భాగంగా జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెల్మ సమత నవీన్‌రెడ్డి, మేడిపల్లి బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు అంకం సాగర్, ఫ్యాక్స్ సీఈవో గోపి, సర్పంచ్ సంపత్ కుమార్, కరస్పాండెంట్ నరేష్, అధ్యాపకుడు వడ్లకొండ జగదీష్, వార్డు సభ్యులు గంగారెడ్డి, నలంద విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



నవతెలంగాణ-ధర్మపురి : మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపికైన దోనూరు ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న పనులు జగిత్యాల అడిషనల్ కలెక్టర్ మంద మకరంద్ బుధవారం పరిశీలించారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ధర్మపురి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మనబస్తీ మనబడి ప్రాజెక్టు కింద చేపట్టుతున్న పనులను పర్యవేక్షించి వివిధ కంపోనెంట్ల వారీగా ఏఈ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బత్తుల భూమయ్య, ఏఇ భోగ సతీష్, దోనూర్ గ్రామ సర్పంచ్ కొండపల్లి సువర్ణ, ఉప సర్పంచ్ జంగిలి మధుకర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కాశెట్టి రమేష్, బక్క శెట్టి మల్లేశం, తదితరులు ఉన్నారు.

వర్గీకరణ అమరవీరులకు నివాళి


నినాదం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కోరుట్ల : పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా కో కన్వీనర్ బలవంతుల సురేష్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసి అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళవత్తుల లక్ష్మీరాజం, దెయ్యాల హన్మంతు, బొడ్డు నరేష్, విజయ్, విక్రమ్, వినోద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన గౌరి



నవతెలంగాణ-కోరుట్ల : పట్టణంలోని కేరళ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న కుమారి కన్యాకుమారి గౌరి సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గౌరి అకుంటిత దీక్షతో చదివి సీటు సాధించి ఇతర విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తుందన్నారు. విద్యార్థినికి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ధర్మపురి : ధర్మపురి మండల కేంద్రంలోని రైతు వేదికలో వరిలో వచ్చే చీడపీడల నివారణ చర్యలపై మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్, ఆధ్వర్యంలో ఏఈఓ నవ్య బుధవారం అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో రైతులను తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి రైతుబంధు సమితి కోఆర్డినేటర్ వడ్నాల మల్లేశం, నరసయ్య పల్లి గ్రామ సర్పంచ్ నేరెళ్ల లావణ్య తిరుపతి, జిల్లా రైతుబంధు సమితి మెంబర్ భారత గుండయ్య రైతు బంధు సమితి సభ్యులు గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమెరికాలో మంత్రి కొప్పులకు ఘన స్వాగతం



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : అమెరికాలో పర్యటనలో భాగంగా సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను అమెరికాలోని సాల్ట్ లేక్ సిటీలో బీఆర్ఎస్ యుఎస్ఏ సభ్యులు, ఫ్యామిలీ సెర్చ్ ఇంటర్నేషనల్ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే, గ్రంథాలయ చైర్మన్



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : మండలంలోని సంగంపల్లి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లిని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్‌లు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజు, సర్పంచ్ సింగం అరుణ,మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క రాధ రావన్న, పాక్స్ చైర్మన్ సందీప్,ఉపా సర్పంచ్ గంగారెడ్డి, నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

దళిత జాతిని కించపరిచిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి


ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ-మల్లాపూర్ : సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలకు పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేష్, అన్నారు. మండలంలోని కొత్తధామ రాజుపల్లి గ్రామానికి చెందిన మామిడి రాజశేఖర్ రెడ్డి మంగళవారం రాత్రి సోషల్ మీడియావేదికగా యావత్ దళిత సమాజాన్ని కించపరుస్తు వ్యాఖ్యలకు పాల్పడ్డాడని, దళిత సంఘాల నాయకులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరిగడ్డి పెద్దలు, కోశాధికారి నిగ రవి , ఆర్గనైజింగ్ సెక్రటరీలు వినయ్ సాహు , కోరుట్ల నరేష్ మరియు మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాపూరపు రాకేష్ మరియు అంబేద్కర్ సంఘాల నాయకులు మేకల సతీష్ దళిత రాజు, మోతే రమేష్, నూతిపెల్లి రాజం, గడచంద జగదీష్ , అనుపట్ల దినేష్, ప్రదీప్, నాగ శేషు, పతకాల అరుణ్, చిన్న పెద్దిరాజం, ఉయ్యాల లక్ష్మణ్, మనోహర్, దామెర శేఖర్, జెల్ల రాజన్న లు పాల్గొన్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా డీజేల వినియోగం



- డీజే సౌండ్‌లతో రాత్రి వేళల్లో వృద్ధులు చిన్నారులకు ఇబ్బందులు
- కరీంనగర్ కమిషరేట్ పరిధిలో డీజేలపై నిషేదాజ్ఞలు అమలు
- సీపీ ఆదేశాలను అమలు చేయని స్థానిక పోలీసులు

నవతెలంగాణ- కరీంనగర్ క్రైమ్ : కరీంనగర్ కమిషరేట్ పరిధిలో బారాత్‌లకు గ్రామాల్లో యథేచ్ఛగా డీజేలను వినియోగిస్తున్నారు. డీజేల నుంచి వచ్చే భారీ సౌండ్ పొల్యూషన్‌తో వృద్ధులు, చిన్నారులు, ఇతర వ్యాధి గ్రస్తులు ఇబ్బందులు తీవ్ర పడుతున్నారు. కమిషనరేట్ పరిధిలో డీజేల వినియోగంపై కరీంనగర్ సీపీ నిషేదాజ్ఞలు విధించారు. అయినా ఎలాంటి అనుమతి లేకుండా పెళ్లిలో బారాత్‌లకు డీజేలను వినియోగిస్తున్నారు. సీపీ ఆదేశాలను అమలు చేయాల్సిన స్థానిక పోలీసు సిబ్బంది చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌గా ఏర్పడినప్పటి నుంచి పెళ్లిలో బారాత్‌లకు డీజేల వినియోగంపై నిషేదాజ్ఞలు కొనసాగుతున్నాయి. ఎవరైనా డీజేలను వినియోగిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రాంతాల్లో డీజేల వినియోగం కొంత తక్కువగా ఉన్నా, గ్రామాల్లో మాత్రం యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. గ్రామాల్లో పెళ్లిలకు డీజేలను వినియోగించడానికి స్థానిక పోలీసుల నుంచి అనుమతి కోసం ప్రయత్నాలు చేస్తుండగా, వారు నిరాకరించ డంతో అయినా స్థానిక పోలీసులకు సమాచారం లేకుండా గ్రామాల్లో డీజేలను వినియోగిస్తున్నారు. ఒక వేళ సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఊరికి వెళ్లితే అక్కడ వారికి మూడుపులు ఇచ్చి పంపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ మండల పరిధిలో డీజేలపై నిషేధాజ్ఞలు అమలు చేయాల్సిన స్థానిక పోలీసులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. డీజేల వినియోగంపై పోలీసులు చర్యలు చేపట్టకపోవడంతో కార్యక్రమాలు నిర్వహించే వారు పోలీసులు వస్తే చూద్దాం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. రాత్రి పూట బారాత్‌లకు భారీ సౌండ్‌తో డీజేలను వినియో గించడం వల్ల ప్రజలకు నిద్ర భగంతో పాటు వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కరీంనగర్ సీపీ స్పందించి డీజేల వినియోగంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పది విద్యార్థులకు స్నాక్స్

- ప్రత్యేక తరగతుల్లో అందజేస్తున్న ప్రభుత్వం
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కసరత్తు


పెగడపల్లి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు,

నవతెలంగాణ- పెగడపల్లి : ప్రత్యేక తరగతుల్లో ఆకలితో అలమటిస్తూ ఉత్తమ ఫలితాలు సాధనకు శ్రమిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోని పది విద్యార్థుల కడుపు నింపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించేందుకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నాయి. అయితే ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఆకలితో అలమటించకుండా సాయంత్రం స్నాక్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 10వ తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. గత ఈనెల 15 నుంచి ఏప్రిల్ 1 తేదీ వరకు సెలవు రోజులు మినహా 34 రోజులపాటు విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి నిత్యం రూ. 15 విలువైన తిరుబండారు అంద జేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో 197 ప్రభుత్వ పాఠశాలల్లో 197 ప్రభుత్వ పాఠశాలల్లో 5, 992 మంది పది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేసి స్పెషల్ టెస్టులను నిర్వహిస్తూ 100శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేస్తున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. స్పెషల్ క్లాసులు డిసెంబరు 1 నుంచి ప్రారంభించి ఉదయం 8 గంటల నుండి 9గంటల 45 నిమిషాల వరకు సాయంత్రం 4 గంటల 45 నిమిషాల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థికి నిత్యం రూపాయలు 15 చొప్పున 34 రోజులకు మొత్తము 5,992 మందికి 30,55,920 నిధులను మంజూరు చేసింది. ఈ నిధులను ఆయా పాఠశాలల ఎస్ఎంసి ఖాతాల్లో జమ చేశారు. స్నాక్స్ అందించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్నాక్స్ అందించడం సంతోషకరం



స్పెషల్ క్లాసుల సమయంలో ఆకలితో ఇబ్బంది పడే వాళ్ళం ప్రభుత్వం స్నాక్స్ అందించడం సంతోషకరం. దీంతో ఇబ్బంది లేకుండా చదువ కొగలుగుతున్నాం.

కుంచె అనన్య పదవ తరగతి పెగడపల్లి

చదువుపై దష్టి పెడుతున్నాం



ఉదయం 8 గంటలకే ప్రత్యేక తరగతులు ప్రారంభ మవుతున్నాయి. సాయంత్రం కూడా 6 గంటల వరకు ఉండాల్సి రావడంతో ఆకలి అయ్యేది సాయంత్రం పూట స్నాక్స్ అందించడంతో చదువుపై దష్టి పెట్టగలుగుతున్నాం.

నిహారిక పదవ తరగతి పెగడపల్లి,

నిధులు జమ అయ్యాయి

ఎస్ఎంసీ ఖాతాల్లో పదవ తరగతి విద్యార్థుల స్నాక్స్ కు సంబంధించిన డబ్బులను జమ చేశాం ప్రతిరోజు 10వ తరగతి విద్యార్థికి రూ 15 విలువ గల స్నాక్స్ ను అందిస్తున్నాం. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

జగన్మోహన్ రెడ్డి డీఈవో జగిత్యాల,

వర్గీకరణ సాధిస్తాం.. మాదిగ అమరులకు అంకితమిస్తాం

ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారాం

నవతెలంగాణ- జగిత్యాలటౌన్ : ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివాని, వర్గీకరణ సాధించి అమరులకే అంకితమిస్తామని ఎంఎస్పీ జగిత్యాల జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం అన్నారు. బుధవారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని స్థానిక మునిసిపల్ పార్క్ వద్ద అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేసిన నిర్లక్ష్యం వల్ల వర్గీకరణ పోరులో సురేందర్ మాదిగ, దామోదర్ మాదిగ, మహేష్ మాదిగ, భారతి మాదిగలను ఎందరినో ఉద్యమ వీరులను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ 8 ఏండ్లు గడిచాయన్నారు. వర్గీకరణ పై ఉభయ సభల్లో మాట్లాడకుండా మాదిగలను ఓటు బ్యాంకుగా ఎన్నికల సందర్భంలో వాడుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తూ వస్తున్నారని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా మౌనం వీడి మాదిగలపై చిత్తశుద్ధి ఉంటే మాదిగల చిరకాల కోరిక ఐన ఎస్సీ వర్గీకరణ బిల్లును రాబోయే పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదింప చేయాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషల్ పార్టీ కో కన్వీనర్ బెజ్జంకి సతీష్ మాదిగ, దుమాల రాజ్ కుమార్, ఎస్సీ ఎస్టీ అట్రాసిక్ మాంటింగ్ కమిటీ మెంబర్ ధరూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు జగిత్యాల నియోజకవర్గ మహాజన సోషలిస్ట్ పార్టీ కన్వీనర్ బోనగిరి కిషన్ మాదిగ, దుమాల గంగాధర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నక్క గంగారం, మానవ హక్కుల కమిషన్ మెంబర్ మహాజన సోషలిస్ట్ పార్టీ జగిత్యాల నియోజకవర్గం కోకన్వీనర్ మీసాల సాయిలు, బిరుదుల గంగారాం, జగిత్యాల అర్బన్ మండల ఇంచార్జ్ బిరుదుల శ్రీనివాస్, రేగుంట అంజి, ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి దుమాల గంగాధర్, దుమాల రాజయ్య, నరసయ్య, కట్కూరి సాయన్న, రాజం, గంగాధర్, రమేష్, రాజేందర్, రవి, రమేష్, ఉన్నారు




నీరు విడుదల చేయాలని రైతుల ధర్నా



నవతెలంగాణ-వెల్గటూర్ : ఎండపల్లి మండలంలోని ఉండడా, ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాల రైతులకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోని వేమునూరు పంపు హౌజ్ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి, వెల్లటూరు మండలంలోని జంగల్ నాల ప్రాజెక్టుకు శాశ్వత నీటి పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ బుధవారం డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్, రాయపట్నం రాష్ట్ర రహదారి రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎస్సై నరేష్, తహసీల్దార్ ఉదయ్‌కుమార్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. తలాపున గోదావరి ఉన్నప్పటికీ ఎండాకాలం వచ్చిందంటే ఈ ప్రాంత రైతులు అందరు కలిసి కరీంనగర్‌లోని మంత్రి దగ్గరకి వెళ్లి నీటిని విడుదల చేయాలని వేడుకోవాల్సి వస్తుందన్నారు. నోటి దాకా వచ్చిన పంటలు ఎండిపోయే పరిస్థితిలో ఉన్నాయని, వేమునుర పంప్ హౌస్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత రైతులు, అధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పటికి ఈ ప్రాంత రైతాంగానికి నీటిని విడుదల చేయలేదని, ప్రభుత్వం సంబంధిత కాంట్రాక్టర్ కి బిల్లులు సకాలం లో చెల్లించక పోవడం వల్ల ఈ ప్రాంత రైతులకు నీరు అందడం లేదని ఆరోపించారు. అనంతరం ఎండపెల్లి తహసీల్దార్ ఉదయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ..సంబంధిత అధికారులతో మాట్లాడి వేమునూరు పంప్ హౌస్ నుండి మూడు రోజుల్లోగా నీటిని విడుదల చేస్తామని. అదేవిధంగా జంగాల్ నాల ప్రాజెక్టు పది రోజుల్లోగా శాశ్వత నీటి పరిష్కారం చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, వెల్గటూర్ గ్రామ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గుండేటి జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు మేరుగు నరేష్ గౌడ్, బందెల ఉదయ్ గౌడ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు పుదరి రమేష్, చెన్న కుమారస్వామి, గాజుల విజయ్, వేణుగోపాల్, మహేష్, హరీష్, లింగారెడ్డి, మల్లేష్ గౌడ్, వెంకటయ్య, అనిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

పేదింటి ఆడబిడ్డకు అండగా కల్యాణ లక్ష్మి !

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్


కళ్యాణ లక్ష్మి చెక్కులను అందిస్తున్న సంజయ్

నవతెలంగాణ-మల్లాపూర్ : పేదింటి ఆడబిడ్డకు అండగా కల్యాణలక్ష్మి నిలుస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ కాటిపల్లి సరోజన, జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్‌తో కలిసి (50) కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సరి కేల లక్ష్మి, గోవింద్ నాయక్, రుక్మా, నత్తి లావణ్య, కష్టవేణి,ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షుడు ఏనుగు రామ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్,రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్, ముద్దం శరత్ గౌడ్, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ డీలర్ మల్లయ్య, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జగిత్యాల మాజీ చైర్‌పర్సన్



నవతెలంగాణ-జగిత్యాల : జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వేధింపులు భరించలేక తన మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన డాక్టర్ బోగ శ్రావని, బీఆర్ఎస్ సభ్యత్వానికి, కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేశారు. అనంతరం ఎంపీ ధర్మపురి అరవింద్, హుజరాబాద్ ఎమ్మెల్యే బీజేపీ నేత ఈటెల రాజేందర్ భోగ శ్రావణి ఇంటికి వచ్చి పార్టీలోకి ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు భోగ శ్రావణి బుధవారం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ సమక్షంలో బీజేపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి, జిల్లా అధ్యక్షులు మోర పెల్లి సత్యనారాయణ రావు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో బీజేపీ నాయకుల చేరిక



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : జగిత్యాల రూరల్ మండలం తక్కలపెల్లి గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు ఏదుల్ల రాధా సతీష్,బీజేపీ నాయకులు మాజీ వార్డ్ మెంబర్ నరేష్,గంగాధర్, అనుచరులు 50 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్; జిల్లా గ్రంథాలయ చైర్మన్ గొల్ల చంద్రశేఖర్‌గౌడ్‌లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నక్కల రాధా రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సందీప్‌రావు, సర్పంచ్ జయపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ దశరత్ రెడ్డి, సీనియర్ నాయకులు రమణారెడ్డి, ఉపసర్పంచ్ విక్రమ్, రాజేశ్వర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

పాల డైయిరీ ప్రారంభం



నవతెలంగాణ-జగిత్యాల : జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్ చౌరస్తా చలగల్ గ్రామం నల్వాల సురేష్ నూతన పల్లెపాలు డైయిరీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. సురేష్ స్వంత డైయిరీ పాలను పల్లెపాలుగా స్వచ్ఛమైన నాణ్యమైన పాలను పెరుగు నెయ్యిని ప్రజలకు అందించడం చాల గొప్ప ఆలోచన అన్నారు. ఇలాగే భవిష్యత్ లో ఇంకా ముందుకి వెళ్లాలని సూచించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు.జున్ను రాజేందర్, బింగి రవి,గంగన్న రాజేష్, రాజు, వేణు, సతీష్ ఉన్నారు.

పట్టణంలో జాబ్‌మేళా



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : పట్టణంలో ఆర్కే, ఎస్ఎస్‌వీ విద్యాసంస్థల అధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం 40 కార్పొరేట్ కంపెనీలు 2వేల పైనా జాబ్‌లతో మెగా జాబ్ జాబ్ మేళాను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ రాజేందర్, అధ్యాపకులు మల్లేశం, బ్రహ్మండ భేరి నరేష్, పాల్గొన్నారు.

జగిత్యాలలో విద్యుత్ ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ-జగిత్యాల : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు జగిత్యాల డివిజన్ విద్యుత్ ఉద్యోగులు డెమోషన్ ధర్నా చేశారు. విద్యుత్ సంస్థల్లో 1-4-2022 నుంచి ఉద్యోగుల పీఆర్సి అమలు చేయాలి కానీ యాజమాన్యం ఇప్పటివరకు పీఆర్సి అమల్లో మొండి వైఖరిని నిరసిస్తూ డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

మల్లారెడ్డి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాల : బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మద్దెల నారాయణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ దేవ్ సింగ్ రాథోడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి సంపత్ కుమార్‌లు కలిసి సాక్షి రిపోర్టర్ గూడ మల్లారెడ్డిని స్వగ్రామమైన పోరండ్ల గ్రామంలో పరామర్శించారు. వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా రుక్మవ ఆత్మ కు శాంతి చేకూరాలని కోరారు.

అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



నవతెలంగాణ-జగిత్యాల : జగిత్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఆందోళన నిర్వహించారు. పట్టణ పరిధిలో మొత్తం 3355 మంది అర్హులను గుర్తించగా వారికి సంబంధించిన క్యాస్ట్, ఇన్ కమ్ సర్టిఫికేట్‌ల కోసం ప్రజలు పెద్ద ఎత్తున కార్యాలయానికి తరలివచ్చారు. ఆర్ ఐ ఒక్కడే ఉంటడం వల్ల సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుందని, మూడు రోజుల్లోపే అధికారులకు ఈ సర్టిఫికేట్లు ఇవ్వడం ఎలా సాధ్యం అని డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు అధికారులను నిలదీశారు.

రోళ్ళ వాగు ప్రాజెక్టుని సందర్శించిన జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీ విద్యార్థులు



నవతెలంగాణ-జగిత్యాల : జగిత్యాల పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన 7వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బీర్పూర్‌లో గల రోళ్ల వాగు ప్రాజెక్టు, శ్రీలక్ష్మి నరసింహస్వామిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ఉద్యోగాలు సాధించిన 'నలంద' విద్యార్థులు

నవతెలంగాణ-జగిత్యాల : జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆర్కే, ఎన్ఎస్‌వి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో నలంద డిగ్రీ కళాశాలకు చెందిన 102 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని, ఇంకా సుమారు 58 మంది విద్యార్థుల ఫలితాలు వెల్లడి కావాల్సి ఉందని కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు తోటి విద్యార్థులు అభినందిస్తూ మిగతా విద్యార్థులకు కూడా ఉద్యోగాలు రావాలని ఆకాంక్షించారు.

ఘనంగా గోదాదేవి రంగనాథుల కళ్యాణం

హాజరైన ఎమ్మెల్యే కల్వకుంట్ల


కళ్యాణం లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ-మల్లాపూర్: మండలం లోని రాఘవ పేట గ్రామంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవంలో కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆయన సతీమణి సరోజన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయం పూట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నత్తి నరసయ్య లావణ్య బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు దేశెట్టి నాగేష్, బోయిని సిద్దయ్య, ఎండి అమ్మినోద్దీన్ అర్చకులు సంతోషా చార్యులు, గురిజెల లక్ష్మీనారాయణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రాష్ట్రం కాంగ్రెస్ తోనే సాధ్యం

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-హుజురాబాద్: ప్రజా వ్యతిరేక పనులు చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై, బీఆర్ఎస్ ప్రభుత్వాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం తెచ్చే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకే ఉందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి హుజురాబాద్ పట్టణంలో హాథ్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆయన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పేదలకు కావలసిన అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలను అడ్డగోలుగా పెంచుతూ పోతోందన్నారు. ప్రజలు సోనియాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ పట్ల నమ్మకం పెంచుకున్నారని తెలిపారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను తెగ నమ్ముతున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపి బుద్ధి చెప్పాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే పేదవాడు నిర్మించుకునే ఇండ్లకు ఐదు లక్షలు ఉచితంగా ఇస్తామని, ఆరోగ్యశ్రీ పరిధిని ఐదు లక్షలకు పెంచుతామని, 1300 సిలిండర్ను 500 కే అందిస్తామని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో హుజురాబాద్‌లో డాక్టర్ బలమురిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా ఇంచార్జ్ అంజన్ కుమార్ యాదవ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఠాకూర్ మఖాన్ సింగ్, హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ డాక్టర్ బలుమూరు వెంకట నర్సింగరావు, లక్ష్మణ్ కుమార్, పత్తి కృష్ణారెడ్డి, సొల్లు బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ - ముత్తారం:
ఎనిమిదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త 3రోజుల సమ్మెలో భాగంగా బుధవారం ముత్తారం మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టి, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిటైర్ అయ్యే ఉద్యోగులకు గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు నింపకపోవడంతో అంగన్వాడీ సెంటర్ల పని కుంటుపడుతోందని వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉద్యోగుల మండల అధ్యక్షురాలు కె.శోభ, మండల నాయకులు బి.రమ, పి.విజయలక్ష్మి, బి.సత్యవతి, జి.కొండమ్మ, ఎం.రజిత మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులున్నారు.

నవతెలంగాణ-గోదావరిఖని: మూడు రోజుల సమ్మెలో భాగంగా మొదటి రోజు బుధవారం రామగుండం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎదుట అంగన్వాడి ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలైన పర్మినెంట్, కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లాంటి విషయాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఎనిమిదేండ్లుగా అంగన్వాడీ టీచర్లకు టీఏ, డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలను, గ్యాస్ బిల్లులు ఇప్పటి వరకు కూడా పెంచలేదన్నారు. దీనివల్ల అంగన్వాడీ ఉద్యోగులు తమ వేతనం నుండే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఆర్.కమలేష్, ఎస్.రామలక్ష్మి తులసమ్మ, ఇ.మహేశ్వరి, రాజేశ్వరి, నిర్మల, సత్యమ్మ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

నవతెలంగాణ - సిరిసిల్ల : 3వ తేదీన సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగల సమస్యల పరిష్కారానికి చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ సామల కవిత, సీఐటీయూ నాయకులు సందుపట్ల పోచమల్లు, గడ్డం రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



నవతెలంగాణ - గంభీరావుపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలో రూ.కోటీ 20లక్షలతో నిర్మించే 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలకు ఖర్చుల భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పించే దిశగా ముందుకు వెల్లుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని వసతులతో ప్రభుత్వం ఆధునీకరించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గంభీరావుపేట ప్రాంతంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటకం శ్రీధర్, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, కోళ్లమద్ది, నర్మాల సర్పంచులు కేశవరావు, ఎడబోయిన రాజు, వైస్ ఎంపీపీ దోసల లత, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, వార్డు సభ్యురాలు రజిత, పంచాయతీరాజ్ ఏఈ సాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మిద్దె తోటల పెంపకంపై అవగాహన

2 వేల టమాటా మొక్కల పంపిణీ



నవతెలంగాణ - రామడుగు : ఇంటి పరిసరాల్లో ప్రతి ఒక్కరూ కూరగాయలు సాగు చేసుకోవాలని దాని వల్ల ఆరోగ్యంగా ఉండడంతో పాటు నెలవారీ ఖర్చును తగ్గించుకోవచ్చని వెలిచాల గ్రామానికి చెందిన రైతు ఉప్పు తిరుపతి వివరించారు. మండలంలోని వెలిచాల గ్రామం పరిధిలోని గుడివెలుగులపల్లికి చెందిన కూరగాయల సాగు రైతు ఉప్పు తిరుపతి మంగళవారం గ్రామంలో 200మందికి 2వేల టమాటా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూరగాయల సాగు తగ్గడంతో డిమాండ్ పెరిగి, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధరలు మండి పోతున్నాయన్నారు. సాగులో రసాయనాల వాడకం కూడా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద కొన్ని కూరగాయల మొక్కలను పెంచుకోవాలని సూచించారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యంతోపాటు నెల నెలా కొంత పొదుపు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిగారి ఎల్లయ్య, బండపెల్లి శ్రీకష్ణ, ఉప్పు శ్రీనివాస్, ఉప్పు లక్ష్మన్, కాడె కనుకయ్య ఉప్పు నరేష్, పోకల మధు, దైవాల వెంకటేశ్, నర్సింహా రాజు, ముచ్చె రాజేందర్, ఇరుకుల్ల మహేశ్ వెలిచాల గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు శృతిమించడమే కాకుండా ప్రజాస్వామ్యన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భూపాల్‌పల్లి జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రపై బీఆర్ఎస్ నాయకులు దాడిచేయడం సరికాదని ఖండించారు. బుధవారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి చిత్రపటాలను దహనం చేసేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోబోయారు. ఎంత ప్రయత్నం చేసినా చివరికి కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడారు. ఈ నెల 4న సిరిసిల్లలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర ఉంటుందని, ప్రతిఒక్కరు విజయవంతం చేయాలని కోరారు.

సుల్తానాబాద్‌లో హైటెక్ దొంగలు

నవతెలంగాణ - సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలో నాలుగు రోజుల నుండి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి షాపులలో నూనె కాటన్ల రేట్లను తెలుసుకొని అవి తీసుకొని బండిపై పెట్టుకొని షాపు యజమాని గూగుల్ పే నెంబర్ లేదా ఫోన్ పే నెంబర్ అడిగి సెండ్ చేస్తున్నారు. తన మొబైల్లో చూసుకునే లోపల వాహనంపై ఉడయిస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు ఆందోళన పడుతున్నారు. పట్టణంలో ఇప్పటివరకు సుమారు నాలుగు షాపులలో ఇలాంటి ఘటన జరగడంతో పట్టణంలో చర్చనీయాంశం అయింది.

ఇండ్లను పరిశీలించిన ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండలం అంబేడ్కర్ నగర్ కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్లాబ్ నిర్మాణం పనులు సర్పంచ్ పాటి దినకర్, ఎంపిటిసి అరుణ్ కుమార్, బంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గద్దరాశి భగవంతం, కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ బానొతు రవి నాయక్, డాక్టర్ వెంకటేష్ బుధవారం ప్రారంభించారు. 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేందర్, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు పోరాడదాం

నవతెలంగాణ - వీర్నపల్లి : అమరవీరుల ఆశయ సాధనకు పోరాడదామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ కానపురం లక్షణ్ మాదిగ అన్నారు. వీర్నపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరులకు బుధవారం ఘన నివళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిటిసి అరుణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వడ్లూరి రాజం, నాయకులు గద్దరాశి భగవంతం, లచ్చయ్య, రాజం, దేవరాజు, చంద్రయ్య, శంకర్, పోషయ్య పాల్గొన్నారు.

కార్మిక విభాగం కో-ఆర్డినేటర్‌గా ఎండి.ప్యారే మియా

నవతెలంగాణ - గోదావరిఖని: బీఆర్ఎస్ రామగుండం కార్పొరేషన్ కార్మిక విభాగం కో-ఆర్డినేటర్‌గా ఎండి.ప్యారేమియా నియమితులయ్యారు. ఈ మేరకు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఎండి.ప్యారేమియాకు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, కుమ్మరి శ్రీనివాస్, నాయకులు పర్లపల్లి రవి, బొడ్డు రవీందర్, నూతి తిరుపతి తదితరులున్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



నవతెలంగాణ - గోదావరిఖని: సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో 11 లక్షల జడ్పి నిధులతో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అంతర్గాం ఎంపీపీ దుర్గం విజయ, జెడ్పీటీసీ ఆముల నారాయణ, వైస్ ఎంపిపి మట్ట లక్ష్మి మహేందర్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు దివాకర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్ తదితరులున్నారు. రామగుండం కార్పొరేషన్ 2వ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో రూ.20లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, ఇందిరమ్మ కాలనీలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధుల కింద రూ.25లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్లు రమణారెడ్డి తదితరులున్నారు.

రేషన్ డీలర్లు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాలి

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ - గోదావరిఖని: రేషన్ డీలర్లు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల రేషన్ డీలర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంతర్గాం ఎంపీపీ దుర్గం విజయ, జడ్పిటిసి ఆముల నారాయణ, వైస్ ఎంపిపి మట్ట లక్ష్మి మహేందర్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు దివాకర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్ తదితరులున్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి



నవతెలంగాణ - గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ 47వ డివిజన్ గణేష్ నగర్ ఏరియాలోని కొన్ని కాలనీలలో వాటర్ సప్లైలో సమస్యను పరిష్కరించాలని కమిషనర్ బి.సుమన్ రావుకు కార్పొరేటర్ మేకల సదానందం బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. వేసవి ప్రారంభిస్తున్న నీటి సమస్య మరింత పెరిగే అవకాశముందని, అధికారులు స్పందించి సరఫరా చేసే సమయాన్ని, ప్రెషర్ పెంచాలని కోరారు.

ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

నవతెలంగాణ - గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఓబి కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా డీజీఎం పర్సనల్ లక్ష్మినారాయణకు కార్మి మకుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎంఏ గౌస్, వేల్పుల కుమారస్వామి, పూసాల తిరుపతి, ఎ.వెంకన్న, తోకల రమేష్, మద్దెల శ్రీనివాస్, శనగల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఓబీ యాజమాన్యాలను ప్రోత్సహిస్తూ శ్రమ దోపిడీని చేయిస్తున్నదన్నారు. హైపర్ కమిటీ వేతనాలు ఇప్పించాల్సిన సింగరేణి యాజమాన్యం ఓబి యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నదని తెలిపారు. సింగరేణి యాజమాన్యం అండతోనే ఓబి యాజమాన్యాలు చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. తక్షణమే సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకొని ఓబి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచే విధంగా తగు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

పటణంలోని పాఠశాలల్లో డీఈవో తనిఖీ



నవతెలంగాణ - సిరిసిల్ల స్థానిక సిరిసిల్ల పట్టణం సుందరయ్య నగర్ లో ప్రాథమిక పాఠశాల,భవిత సెంటర్, మండల వనరుల కేంద్రం,లను రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి రమేష్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో పిల్లలతో మాట్లాడి వారి సామర్థ్యాన్నివారి విద్యపై సమస్యలపై ఆరా తీస్తూ ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గోదాంలోని బుక్స్ స్టాక్ లిస్టులను పరిశీలించారు. జిల్లా విద్యాధికారి నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో మండల వనరుల కేంద్రం, పాఠశాల భవిత కేంద్రం ఉపాధ్యాయులు సిబ్బంది జిల్లా విద్యాధికారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘుపతి, బుక్స్ ఇన్చార్జి లక్ష్మీనారాయణ, భవాని విష్ణు సలీం, సత్యం ఉన్నారు.

'డబుల్' ఇండ్ల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం



నవతెలంగాణ-గోదావరిఖని
నత్త కూడా సిగ్గుపడేలా గోదావరిఖనిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం జరుగుతున్నదని సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ విమర్శించారు. బుధవారం సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్, రాష్ట్ర సమితి సభ్యులు గోషిక మోహన్, జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్ గోదావరిఖని డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లు రామగుండం కార్పొరేషన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో 850 నిర్మిస్తున్నప్పటికీని, దాదాపు ఏడు సంవత్సరాలు గడుస్తున్నా ఆ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు కోసం డ్రా తీసినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వెళ్లి పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లలో పేరుకుపోయిన సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 9న రామగుండం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరూ పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, జిల్లా సమితి సభ్యులు మాటేటీ శంకర్, ప్రజా సంఘాల నాయకులు ఎర్రల రాజయ్య, మార్కాపూరి సూర్య, శనగరపు చంద్రశేఖర్, రేణికుంట్ల ప్రీతం, సిరిసిల్ల మల్లేష్, కలవల జగన్, ఆసాల నవీన్, అబ్దుల్ కరీం, సుధీర్ తదితరులున్నారు.

పురుగులమందు తాగి ఆత్మహత్య

నవతెలంగాణ-ముత్తారం: మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన నరాల అపర్ణ పురుగుల మందు తాగగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ముత్తారం ఎస్ఐ బేతి రాములు తెలిపారు. అపర్ణ తండ్రి బండి మధునయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్తారం ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అపర్ణ మానసిక పరిస్థితి బాగాలేక పురుగుల మందు తాగినట్టు తెలిపారు. అంతేగాకుండా తన కూతురు గాయత్రికి కూడా పురుగులు తాగించినట్లు తెలిపారు. ప్రస్తుతం గాయత్రి కరీంనగర్‌లో చికిత్స పొందుతోందని తెలిపారు.

15, 23వ తేదీల్లో సదరం శిబిరం

నవతెలంగాణ - సిరిసిల్ల : మార్చి 15, 23వ తేదీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాల విభాగం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా కంటిచూపు, వినికిడి, ఆర్థో, సంబంధిత వైద్యులు నిర్ధారించిన తేదీలు, స్లాట్‌ల ప్రకారం మీసేవా కేంద్రాల ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న దివ్యాంగులకు ఈ శిబిరంలో అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ తేదీలను ఆన్లైన్ షెడ్యూల్లో పెట్టాలని అలాగే మండలాల అభివృద్ధి అధికారులు, సిరిసిల్ల, వేములవాడ, కమిషనర్లు తమ పరిధిలోని వారికి సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీన కంటిచూపు, వినికిడి, ఈనెల 23వ తేదీన ఆర్థో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ తేదీలలో సదరం శిబిరానికి హాజరుకావాలని మీసేవ స్లాట్‌తోపాటు ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్‌రే, ఫోన్ నెంబర్, తమ వెంట తీసుకొని శిబిరానికి హాజరు కాగలరని పేర్కొన్నారు.

గురుకులాలు ఆత్మగౌరవ ప్రతీకలు

- సాంఘిక సంక్షేమ పాఠశాలల్లోనే అడ్మిషన్లు పొందాలి
- ప్రొగ్రెసివ్ పేరెంట్ లీగ్ జిల్లా అధ్యక్షుడు గోసిక కుమార్



నవతెలంగాణ - కరీంనగర్ : బడుగు, బలహీనవర్గాల జీవితాలలో వెలుగులు నింపుతున్న తెలంగాణ గురుకులాలు ఆత్మగౌరవ ప్రతీకలుగా నిలుస్తున్నాయని ప్రొగ్రెసివ్ పేరెంట్ లీగ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోపిక కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీ టూ పీజీ మిషన్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన ఉచిత నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని పేదలకు గురుకులాలు వరంగా మారయని, విద్యకు దూరమైన ఎందరో విద్యార్థులు ఇందులో చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. గురుకులాల్లో ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యను అందిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి విద్యార్థి గురుకులాల్లోనే చదువుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థుల నుంచి గురుకులాల అడ్మిషన్లు కోరుతున్నదని, విద్యార్థులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు గడువు మార్చి 6వరకు ఉంటుందని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. అన్ని జిల్లాలలో ఎంపిక చేసిన కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు www.tswreis.ac.in వెబ్‌సైట్‌తోపాటు 9490052568 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం..

నవతెలంగాణ - సిరిసిల్ల
తరచూ బోరు బావుల్లో ప్రమాదవశాత్తు చిన్న పిల్లలు పడి మరణిస్తున్నారు. జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అధికారులే ఇంత నిర్లక్ష్యం చేస్తే, ప్రమాదం జరిగితే బాధ్యులెవరు? ఇది సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ స్థలంలో ధికారులు బోరు వేసి, ఇలా నిర్లక్ష్యంగా వదిలేసారు. ఇది పద్మ నగర్, జెపి నగర్ కాలనీ జనావాసాలకు పది అడుగుల దూరంలో ఉంది.



బోరువేసి నిర్లక్ష్యంగా వదిలేసిన మున్సిపల్ అధికారులు

స్టోన్ క్రషర్ల సిండికేటు

- ఎత్తివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- లేదంటే అభివద్ధి పనులను నిలిపివేస్తాం.
- తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దర్శనాల శంకరయ్య



నవతెలంగాణ - సిరిసిల్ల రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టోన్ క్రషర్ల సిండికేట్‌ను ఎత్తివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిలిపివేస్తామనితెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దర్శనాల శంకరయ్య హెచ్చరించారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శంకరయ్య మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా స్టోన్ యాజమాన్యం అంతా ఒక సిండికేట్‌గా ఏర్పడి వాస్తవ ధరలు కాకుండా అధిక ధరలకు అమ్ముతున్నారని, పక్క జిల్లాల నుంచి తక్కువ రేటుకు కంకర తీసుకొస్తే వాటిని అడ్డుకుంటున్నారని తెలిపారు. సిరిసిల్లలో ఉన్న స్టోన్ క్రషర్స్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతలేని కంకర అమ్ముతూ ఎటువంటి వే బిల్ లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతోందన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే సిరిసిల్లలో ఉన్న స్టోన్ కషర్స్ యాజమాన్యం సిండికేట్ ఎత్తివేసేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను నిలిపివేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంగం వీరారెడ్డి, దార్సింగ్, పి.రామచందర్, హనుమంత రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు పిట్టల్లా రాలుతున్నా పట్టించుకోరా

భీం ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ - సిరిసిల్ల : రాష్ట్రంలో శ్రీ చైతన్య విద్య సంస్థలలో చదువుతున్న విద్యార్థులు రోజుకు ఒక్కరూ చనిపోతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని భీం ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో మీడియాతో మాట్లాడారు. శ్రీ చైతన్య నర్సింగ్ కళాశాలలో జూనియర్ విద్యార్థి స్వాతిక్ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని, యాజమాన్యం వేధింపులు భరించలేక సాత్విక్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. శ్రీ చైతన్య విద్య సంస్థలలో ఇలాంటి హత్యలు కొత్త కాదని కాలేజ్ యాజమాన్యాలకు మార్కులు ర్యాంకులు, ఫీజులు తప్ప విద్యార్థుల భవిష్యతుపై పట్టింపు లేదని, ఇలాంటి నిర్లక్ష్యం వల్ల ఈ హత్యలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి శ్రీ చైతన్య విద్య సంస్థలను వెంటనే రద్దు చేయాలని సాత్విక్ చావుకు కారణమైన యాజమాన్యం పై కేసు నమోదు చేసి కటినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీం ఆర్మీ నాయకులు మధు, రాజు, ప్రశాంత్ సాయి, నవీన్, కళ్యాణ్ సుదీర్, నాగరాజు పాల్గొన్నారు.

సఖీ సేవలను వినియోగించుకోవాలి

జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం



నవతెలంగాణ-ఇల్లంతకుంట : త్వరలో జరుగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని దాచారం పాఠశాల విద్యార్థులకు బుధవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజ్యం పాల్గొని మాట్లా డారు. స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న హింస, వేధింపులు నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్నటువంటి పథకాలు, సేవలు గురించి వివరించారు. మహిళలు బాలికలు ఏదైనా హింసకు గురైతే ధైర్యంగా టోల్ ఫ్రీ ద్వారా సంప్రదిస్తే వారి సమస్యను గురించి గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం కౌన్సిలర్ కళావతి పాల్గొన్నారు.


విద్యుత్ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : తెలంగాణా సర్కారు నిర్లక్ష్యం వల్లే తమ వేతన సవరణ జరగడం లేదని తెలంగాణ రాష్ట్ర పవర్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పెద్దపల్లి డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ రామానుజం మాట్లాడుతూ రైతులకు ఉచిత కరెంటు సరఫరా చేయడం కోసం పగలు, రాత్రి కష్టపడుతున్నారని, ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నా ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే వేతన సవరణ చేపట్టి వేలాది మంది ఆశలను నెరవేర్చాలని కోరారు. సూపరింటెండెంట్ ఇంజనీరు సుదర్శనం మాట్లాడుతూ ఉద్యోగులకు వేతన సవరణ హక్కు అని, ప్రస్తుత సమాజంలో జీవన వ్యయం పెరుగుతున్నందున వేతన సవరణ ఆవశ్యకమని గుర్తు చేశారు. ధర్నాలో కన్వీనర్ ప్రభాకర్, కో కన్వీనర్ రవీందర్, నాయకులు రాజ్ కుమార్, కరుణాకర్, తిరుపతి, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లాలో 4నుండి ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన

పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్



నవతెలంగాణ - రామగిరి

పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 4నుండి 10వరకు ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన ఉందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉప్పుల శ్రీధర్ తెలిపారు. బుధవారం రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. కేంద్ర యూనియన్ పబ్లిక్ సర్వీస్ (యుపీఎస్) ద్వారా ఉద్యోగం సాధించిన సెంట్రల్ సివిల్ సర్వీస్ ట్రైనీ ఆఫీసర్లకు "విలేజ్ స్టడీ టూర్"కు వస్తున్నారని తెలిపారు. జిల్లాకు ఐదు టీములు వస్తున్నాయని, ఒక్కొక్క టీంలో ఐదుగురు చొప్పున 25 మంది అధికారులు పర్యటిస్తారన్నారు. రామగిరి మండలం రత్నాపూర్, జూలపల్లి మండలం కుమ్మరికుంట, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, మంథని మండలం నాగారం, ధర్మారం మండలం పత్తిపాక, అంతర్గాం మండలం ఆకనపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామాలు ఎంపిక చేసామని తెలిపారు. వారం రోజులపాటు ఈ ఐదు గ్రామాల్లో ఈ అధికారుల బృందం స్థానికంగా ఉండడానికి అనువైన స్థలం ఎంపిక చేస్తామని చెప్పారు. వీరు ఆ గ్రామంలో ప్రజల జీవన విధానం, ఆర్థిక విధానం, గణంక వివరాలు, ప్రభుత్వ పథకాలు, ఇతర స్థితిగతులపై స్టడీ చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు, ఎంపీడీవో ఇనుముల రమేష్, తూముట్ల విజయకుమార్, ఎంపీఓ కాటం భాస్కర్, సెక్రటరీ పెండ్లి రమ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతికుమార్, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా'



నవతెలంగాణ - ఎలిగేడు : పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పెద్దపల్లి నియోజకవర్గంతో పాటు ఎలిగేడు మండల అభివృద్ధికి ఎంతవరకు కృషిచేశారు అనే అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్ విసిరారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావుపై ఎలిగేడు మండల బీఆర్ఎస్ నాయకులు చేసిన విమర్శలు అర్థరహితమని నాయకులు అన్నారు. 9ఏండ్లలో ఎమ్మెల్యే పెద్దపల్లి నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, 50 పడకల ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, మహిళా సంఘాల భవనం, ఫంక్షన్ హాల్, సీసీ రోడ్లు, గురుకుల పాఠశాల ఎమ్మెల్యే అసమర్థ పాలన వల్లే మండలానికి రాలేదని ఆరోపించారు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికే తమ నాయకుడిపై ప్రెస్‌మీట్ పెట్టి సిగ్గులేకుండా విమర్శలు చేశారన్నారు. ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఎంపీపీ స్రవంతికి ఎంపీడీవో కార్యాలయం కరెంట్ బిల్లు కట్టకపోవడంతో విద్యుత్ అధికారులు కరెంట్ కట్ చేసిన విషయం తెలియదా అని ఎద్దేవా చేశారు. మండల కేంద్రం నుండి బీసీ హాస్టల్ తరలి వెళుతున్న సమయంలో అధికారంలో ఉన్న స్థానిక బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మాట్లాడకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలిగేడు మండలానికి 32 డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు అయితే ఒక్క ఇల్లుకు కూడా ముగ్గు పోసిన దాఖలాలు లేవని విమర్శించారు. దమ్ముంటే ఎలిగేడు మండల అభివృద్ధిపై ప్రజాక్షేత్రంలో బహిరంగ చర్చకు బీఆర్ఎస్ నాయకులు రావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సామా రాజేశ్వర్‌రెడ్డి, కొండా తిరుపతిగౌడ్, దుగ్యాల సంతోష్‌రావు, ఆర్నపల్లి వెంకటేశ్వరరావు, కోరుకంటి వెంకటేశ్వరరావు, నరహరి సుధాకర్‌రెడ్డి, అమ్ముల శ్రీనివాస్, సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, పెద్దపల్లి దేవేందర్, దుగ్యాల రామ్‌చందర్‌రావు, అమ్ముల రమేష్, బాసంపల్లి కొండయ్య, చిగుర్ల జగ్గయ్య, నరహరి మోహన్‌రెడ్డి, చింతిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

6వరకు దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ - పెద్దపల్లి : దివ్యాంగుల స్వయం ఉపాధి పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 6 వరకు గడువు పొడిగించినట్టు పెద్దపల్లి అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలు స్థాపించుకొని స్థిరమైన ఆదాయాన్ని పొంది సాధారణ జీవనాన్ని గడపాలనే ఉద్దేశంతో పురావసం పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 20 యూనిట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. 14 మండలాలకు 14 యూనిట్‌లు, 3 మునిసిపాలిటీ లకు మూడు యూనిట్ లు, సుల్తానాబాద్, ఓదెల, రామగుండంకు అదనంగా ఒక యూనిట్ చొప్పున కేటాయించినట్లు తెలిపారు. 20 యూనిట్లలో మహిళలకు జూలపల్లి, పెద్దపల్లి, పాలకుర్తి, రామగిరి, మంథని మండలాలు, సుల్తానాబాద్ మున్సిపాలిటీ కేటాయించినట్లు, మిగిలిన మండలాలు, మున్సిపాలిటీలు జనరల్ కేటగిరీకి కేటాయించారని తెలిపారు. వివరాలకు www.tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్లైన్లో మార్చ్ 6లోగా దరఖాస్తులను సమర్పించి, నమోదు చేసుకున్న దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను సంబంధిత మండల పరిషత్ అధికారి, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇదివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని మంజూరు కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 9440852495 ఫోన్‌లో, సంబంధిత జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పెద్దపల్లి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం




నవతెలంగాణ - జూలపల్లి : జూలపల్లి మండలంలోని కాచాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవిరాంగోపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీ ఓ వేణుగోపాలరావు, ఎంపీఓ కిరణ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంపత్‌రెడ్డి, జూలపల్లి ఏఎంసి చైర్మెన్ కంది చొక్కరెడ్డి, కాచాపూర్ సర్పంచ్ బంటి ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ - సుల్తానాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుల్తానాబాద్ 8వ వార్డు కౌన్సిలర్ చింతల సునీతరాజు అన్నారు. బుధవారం మండల వార్డు మార్కండేయ కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీజ, హెచ్ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, షహనాజ్, మానస, వార్డు ఆఫీసర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానంతో పాటు ఆరోగ్యం, ఆహ్లాదం ఎంతో ముఖ్యం




నవతెలంగాణ - సుల్తానాబాద్ : విద్యార్థులకు పాఠశాల స్థాయిలో విజ్ఞానంతో పాటు ఆరోగ్యం, ఆహ్లాదం ఎంతో ముఖ్యమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు బుధవారం పట్టణంలోని అల్ఫోర్స్ హై స్కూల్‌లో నిర్వహించిన ఫ్లవర్స్ డే - ఫుడ్ ఫెస్టివల్ ఎడ్యూఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాక్ పోలీస్ స్టేషన్, మాక్ కోర్టు, రక్త నమోనాల సేకరణ, పరీక్షల లాబరేటరీ, మానవ దేహంలోని వివిధ అవయవాలు, అవి పని చేసే తీరు, మన పండుగలు, మన గ్రామీణ క్రీడలు మొదలైన ఎన్నో అంశాలను వారు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత

నవతెలంగాణ - జూలపల్లి : జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన సీపెల్లి బాపుకు మంజూరైన రూ.లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తన క్యాంప్ ఆఫీసులో బుధవారం అందజేశారు. పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే అన్నారు. ఆయనవెంట సంకెళ్ల లక్ష్మీనరసయ్య ఉన్నారు.

యారన్ సబ్సిడీ వెంటనే అందించాలి

పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

పవర్ లూమ్ కార్మికులకు 10శాతం యారన్ సబ్సిడీని వెంటనే అందించాలని సిఐటియు అనుబంధ తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం తంగళ్ళపల్లి పవర్లూమ్ కార్మికుల విస్తృతస్థాయి సమావేశాన్ని మండల కేంద్రంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ హాజరయ్యారు. ఈ సమావేశంలో తంగళ్ళపల్లి, పద్మనగర్ గ్రామాలలో పనిచేస్తున్న పవర్లూమ్ కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను రూపొందించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంగళ్ళపల్లిలో పవర్లూమ్ కార్మికులకు పనిభద్రత లేదన్నారు. ఇక్కడ స్థానికేతరులను యజమానులు పనిలో పెట్టుకోవడం వలన స్థానికులకు ఉపాధి లేకుండా పోతుందని మండిపడ్డారు. స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు రావలసిన బతుకమ్మ చీరల 10శాతం యారన్ సబ్సిడీని కాలయాపన చేయకుండా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి చేసి కార్మికులకు అందించాలని కోరారు. అనంతరం సిఐటియు తంగళ్ళపల్లి పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని 21 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కుడిక్యాల కనకయ్య, కార్యదర్శిగా గోరంతల రాజమల్లు, ఉపాధ్యక్షులుగా కోడం వేణు, మూషం శంకర్, సహాయ కార్యదర్శులుగా మామిడాల శేఖర్, గుర్రం బాబు, గౌరవ అధ్యక్షుడిగా అన్నల్దాస్ గంగాధర్, సభ్యులుగా గడ్డం ఎల్లయ్య, ద్యావనపెల్లి రమేష్, భోగ నర్సయ్య, దాసరి రాజు, కందికట్ల సత్యనారాయణ, చేరాల రాజు, ముదిగొండ సత్యనారాయణ, గడుదాస్ రమేష్, గౌడ శ్రీనివాస్, అరగొండ రామచంద్రం, గాజుల రవి, సబ్బని మహేందర్, ఆడెపు కృష్ణహరి, సామల లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు నక్క దేవదాస్, గడ్డం రాజశేఖర్, సందుపట్ల పోచమల్లు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల కోసం 3న ధర్నా

రైస్‌మిల్లు ఆపరేటర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర అంజయ్య


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


నవతెలంగాణ - సుల్తానాబాద్

రైస్ మిల్లు ఆపరేటర్స్ కనీస వేతనాల జీవోను సవరించి నెలకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, డిమాండ్ చేస్తూ ఈ నెల 3న చలో కలెక్టరేట్, ధర్నా జయప్రదం చేయాలని రైస్ మిల్లు ఆపరేటర్ల యూనియన్ (సీఐటీయూ) పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర అంజయ్య అన్నారు. బుధవారం సుల్తానాబాద్ పూసాల పెద్దమ్మ గుడి వద్ద ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైస్ మిల్లు ఆపరేటర్స్‌కు వర్తించే కనీస వేతనాల జీవోలు 2008 నుండి ఇప్పటివరకు సవరించకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. అనేకసార్లు జీవోలు సవరించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేసినప్పటికీ, గత 15 సంవత్సరాలుగా జీవోను సవరించకుండా రైస్ మిల్ ఆపరేటర్స్‌కు అన్యాయం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా కనీస వేతనాల జీవోను సవరించి నెలకు 26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా 3న పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో జిల్లాలోని రైస్ మిల్లు ఆపరేటర్స్ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైస్‌మిల్ ఆపరేటర్ల సంఘం సుల్తానాబాద్ మండలం ఉపాధ్యక్షుడు బ్రహ్మచారి, చంద్రయ్య, స్వామి, కొల్లూరి రాజు, కిరణ్, శ్రీను, హరికిషన్, శ్రీధర్, పూసల సంపత్, తిరుపతి, మహేష్, రవి, రమేష్, ఓదెలు, రాజయ్య, మహేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పన్నూర్‌లో పబ్లిక్ టాయిలెట్స్‌కు సింగరేణి నిధులు మంజూరు

నవతెలంగాణ - రామగిరి : సింగరేణి పబ్లిక్ హియరింగ్ కార్యక్రమంలో భాగంగా రామగిరి మండలంలోని పన్నూర్ గ్రామపంచాయతీలో వివిధ స్థలాల్లో పబ్లిక్ టాయిలెట్స్ మంజూరు చేయాలని స్థానిక సర్పంచ్ అల్లం పద్మతిరుపతి కోరారు. ఈ మేరకు పన్నూర్ మూడవ వార్డులో ఒకటి పన్నూర్ ఎక్స్ రోడ్ వద్ద ఒక పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రజాప్రతినిధులు సంబంధిత సింగరేణి అధికారులు కలిసి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అల్లం పద్మతిరుపతి, రామగిరి జెడ్పీటీసీ మ్యాధరవేని శారదకుమార్ యాదవ్, ఎంపీటీసీ చిందం మహేష్, ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్ యాదవ్, ఎస్ఓటు జీఎం రఘుపతి, ఎస్ఈ పద్మ రాజు, పర్సనల్ డిపార్ట్మెంట్ విలాస్ శ్రీనివాస్ పోద్దార్, వార్డు సభ్యులు పెరుమాండ్ల లావణ్య ప్రసాద్, తన్నీరు ప్రదీప్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


ఆర్జీ -2 ఏరియాలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి



నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ

ఫిబ్రవరి మాసానికి సంబంధించి ఉత్పత్తి, ఉత్పాదకత, ఓవర్ బర్డెన్ వెలికితీత, రవాణా వివరాలను బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 77,45,000 టన్నుల లక్ష్యానికి 78,60,119 టన్నులతో 101శాతం బొగ్గుఉత్పతి సాధించినట్టు చెప్పారు. ఫిబ్రవరి మాసానికి సంబంధించి నిర్దేశించిన బొగ్గు ఉత్పతి లక్ష్యాలలో 7,37,700 టన్నులకు 6,99,349 టన్నులు 95శాతం, ఓబీ వెలికితీత 46,459,000 క్యూబిక్ మీటర్లకు 44,12,833 మీటర్లతో 94 శాతం ఓవర్ బర్డన్ వెలికి తీసినట్టు చెప్పారు. ఓసిపి-3 సిహెచ్‌పి నుండి 7,08,262 టన్నుల బొగ్గును రవాణా చేశామన్నారు. రాబోయే నెల రోజుల్లో ఇదే స్ఫూర్తితో పని చేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని తెలిపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం అబ్దుల్ సలీం, డిజిఎం (పర్సనల్) అండ్ అధికార ప్రతినిధి జి.రాజేంద్రప్రసాద్, డిజిఎం సివిల్ ధనుంజయ, డిజిఎం వర్క్ షాప్ ఎర్రన్న, డిజిఎం (ఐఈ) మురళీకృష్ణ, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం




నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి పురాతన ఆలయం నిర్మాణానికి రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీఆర్ రూ.2కోట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ పేరిటా ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆలయం ముందు వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు నంది కిషన్, ఎంపిపి పిల్లి రేణుకకిషన్, జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఎంపిటిసిలు వందిర్ల నాగరాణి పర్శరాములుగౌడ్, ఎలగందుల అనసూయ నర్సింలు, స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయండి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడారు. ఈ నెల4న సిరిసిల్ల నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. మండలం నుండి 1500 మందిని సిరిసిల్లలో జరిగే బహిరంగ సభకు తరలిస్తామన్నారు. అలాగే మల్కపేట రిజర్వాయర్ నుండి 9వ ప్యాకేజీ కింద ఇప్పటి వరకు పనులు పూర్తికాని కాలువను పరిశీలించాలని రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తామన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు, ప్రభుత్వ ఆసుపత్రిలో 100 పడకల పెంపు తదితర అంశాలను రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, బానోతు రాజునాయక్, మానుక నాగరాజ్‌యాదవ్, దండు శ్రీనివాస్, చిన్ని బాబు, తదితరులు పాల్గొన్నారు.

'ఇండ్ల పంపిణీలో ప్రభుత్వం విఫలం'




నవతెలంగాణ - ఓదెల : ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ పెద్దపల్లి జిల్లా మహిళా కన్వీనర్ సప్న అన్నారు. ఓదెల మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇండ్లు మంజూరు చేసిందో వివరాలు కావాలని సమాచారం హక్కు చట్టం కింద బుధవారం తహసీల్దార్ రమేష్‌కు దరఖాస్తు ఇచ్చారు. సందర్భంగా ఆమె మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడమే తప్ప పేద ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సతూరి అనీల్, మండల మహిళా కన్వీనర్ మేకల శోభ, బుగిడ మానస, పల్లె ప్రశాంత్, కళ్యాణం మహేశ్, వోల్లాల రజిత, పిట్టల అనూష పాల్గొన్నారు.

నిరుపేద యువతికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎడబోయిన మల్లేశం - లక్ష్మి దంపతుల రెండవ కుమారై స్వాతి వివాహనికి ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి 5016 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హసన్, అలీ, నర్సింలు, అంబేద్కర్ యువజన సంఘ నాయకులు బుర్క ధర్మేందర్, గుంటుకు రామరాజం, కోప్పెల్లి ప్రభాకర్, గాదం రామదాసు, శేఖర్ బాబు, కోప్పెల్లి రమేష్ భీమ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్పెల్ బీ పోటీల్లో గాయత్రి విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అక్షర నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పెల్ బీ పోటీల్లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యా నికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బొజ్జ అక్షర, కూన వరూధి (8వ తరగతి), ఉట్నూర్ చక్రిక (7వ తరగతి), కొమురవెల్లి కార్తీక్, చిట్టేటి వర్షిణి (5వ తరగతి), ఎనగందుల సాత్విక్ తేజ(4వ తరగతి) విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు మెడల్స్ తో సత్కరించి, షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ టీ షర్ట్స్ పంపిణీ



నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామంలోని 17మంది క్రికెట్ క్రీడాకారులకు వైకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేష్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడ్డి సాయికిషోర్ గౌడ్ చేతుల మీదుగా స్పోర్ట్స్ టీ షర్ట్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో క్రికెట్ క్రీడాకారులు అడిగిన వెంటనే టీ షర్ట్స్ అందించి ప్రోత్సహిస్తున్న కండెం సురేష్‌కు క్రీడాకారుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

జీఓ.22 గెజిట్ చేయకుండా సీఎం అడ్డుకుంటున్నారు

ఎస్‌సీకేఎస్ కోశాధికారి వేల్పుల కుమారస్వామి


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ

కార్మిక చట్టం జీవో నెంబర్ 22ను గెజిట్ చేయకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డుకుంటున్నారని ఎస్‌సీకేఎస్ (సీఐటీయు) కోశాధికారి వేల్పుల కుమారస్వామి అన్నారు. బుధవారం ఆర్జీ-2లోని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బేస్ వర్క్‌షాప్, స్టోర్, రోడ్ క్లీనింగ్, బ్లాస్టింగ్, హౌస్ కీపింగ్ తదితర సెక్షన్లలో కరపత్రాలు విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల హక్కులకు 18రోజుల సమ్మె విరమణ తర్వాత సింగరేణి యాజమాన్యమే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జీవో నెంబర్ 22 గెజిట్ చేయండి సింగరేణిలో అమలు చేసుకుంటామని లెటర్ రాసినా ఇంతవరకు ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం సరైనది కాదని అన్నారు. జీవోను గెజిట్‌చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా మీద కనీసం ఒక్క రూపాయి కూడా భారం పడదని అన్నారు. అలాంటిది ఎందుకు ముఖ్యమంత్రి సంతకం చేయడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా పెట్టుబడిదారుల కోసం, పెద్దపెద్ద కాంట్రాక్టర్ల కోసం పనిచేస్తున్నారు కానీ ఓట్లు వేసి గెలిపించిన కాంట్రాక్టు కార్మికులకు మొండి చేయి చూపుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవోను గెజిట్ చేయకపోవడం వల్ల అప్పటినుండి ఇప్పటివరకు కార్మికులు ఒక్కో కార్మికుడు ఇప్పటివరకు సుమారు రూ.లక్ష నుండి లక్షా 50వేలు నష్టపోయారని దీనికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి నిర్లక్ష్యమేనని అన్నారు. జీవో నెంబర్ 22 గెజిట్ చేయకపోవడం వల్లనే సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల ఆరవ తేదీన చలో హైదరాబాద్ కమిషనరేట్ కమిషనర్ కార్యాలయం వద్ద మహాధర్నాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ధర్నాకు సింగరేణిలోని కాంటాక్ట్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 అధ్యక్షుడు భూమయ్య, నాయకులు సిహెచ్.ఓదెలు, ఏ.రామన్న, శ్రీను, ముస్తఫా, సంతోష్, రవి, సమ్మయ్య, లక్ష్మణ్, విజయ శంకర్, లక్ష్మీ, రాజేశ్వరి పాల్గొన్నారు.


జెడ్పీ చైర్మన్‌కు సమస్యలు తెలిపిన ఎన్‌సీసీ కార్మికులు



నవతెలంగాణ - మంథని : మంథనిలో బుధవారం పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌ను ఎన్సీసీ కార్మికులు కలిసి తమ సమస్యలను తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఓసిపి-2 ఆఫ్ లోడింగ్ కంపెనీ ఎన్సీసీలో వోల్వో డ్రైవర్స్, హెల్పర్స్‌గా పనిచేస్తున్నట్టు చెప్పారు. తమకు ప్రతి సంవత్సరం రూ.వెయ్యి చొప్పున జీతం పెంచాల్సి ఉన్నా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిసుందని తెలిపారు. టెండర్ పూర్తి అవ్వడం వల్ల మార్చి నెల నుండి ప్రభావిత గ్రామాలు తప్ప చుట్టు పక్కల వేరే గ్రామాల వాళ్లను ఉద్యోగంలోంచి తొలగించారని చెప్పారు. ప్రతి ఒక్క కార్మికునికి ఒకనెల వేతనం అదనంగా ఇవ్వాలని, విటిసి మెడికల్ పేరిట ప్రతి ఒక్కరి దగ్గర ఎన్సిసి యాజమాన్యం రూ.2500 కట్టించిందని, టెండర్ పూర్తి అవ్వడంతోనే కార్మికులకు కంపెనీ వారు తిరిగి చెల్లించాలని, పలు సమస్యల పరిష్కారానికి కార్మికుల పక్షాన కృషి కోరారు. జెడ్పీ చైర్మన్ స్పందించి ఎన్సీసీ యాజమాన్యం ప్రభాకర్‌తో మాట్లాడి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. రచ్చపల్లి సర్పంచ్ కనవేన శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తు నాయకులు, అంగన్వాడీలు

నవతెలంగాణ - మంథని : అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష అన్నారు. ఈ మేరకు సీఐటీయూ ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా బుధవారం మంథని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ ఉద్యోగులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా అంగన్వాడీ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సుగుణ, స్వరూప, అంగన్వాడీ టీచర్లు కనుకలక్ష్మి, జయప్రద, రాధాబాయి, రాజేశ్వరి, విజయలక్ష్మి, శారదా, రజిత, వరుణ, వనిత, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్

సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్, సిడిపి నిధుల ద్వారా రూ.15లక్షలతో పలు సీసీ రోడ్‌ల నిర్మాణానికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, జెడ్పీటీసీ స్వరూప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, కన్వీనర్ రాజమల్లయ్య, సర్పంచ్ అంజలీదేవి, ఎంపీటీసీ నిర్మలఓదెలు, ఉపసర్పంచ్ రాజు, గ్రామ అధ్యక్షుడు ఒజ్జ సదయ్య, రైతు సమన్వయ సమితి గ్రామ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ సంపత్, నాయకులు బొంకూరి ఐలయ్య, ప్రశాంత్, కిషన్‌రెడ్డి, కిషన్‌రావు, శ్రీనివాస్, రాజయ్య, పోచాలు పాల్గొన్నారు.


ఆధారాలతో 'ఆరెంద' బాగోతం బయటపెడతా

బాధితుడు బోరగళ్ళ రాణాప్రతాప్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : తాను కొనుగోలు చేసిన స్థలంలోనే ఇంటిని నిర్మించుకుంటున్నానని, తనపై వ్యక్తిగత కక్ష్యతో ఆరెంద వెంకటస్వామి చేసిన ఆరోపణలో ఎలాంటి నిజం లేదని బోరగళ్ళ రాణాప్రతాప్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాణాప్రతాప్ మాట్లాడుతూ 1932లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన భూమిలో ఉండగా ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమికోల్పోయిన దళితులకు ప్రస్తుత బండారికుంటలోని సర్వేనంబర్ 1లో 86మందికి భూమి పంపిణీ చేసిందని అన్నారు. ప్రభుత్వం నుండి భూమి పొందిన బొంకూరి లస్మయ్య 1957 సంవత్సరంలో అప్పుడున్న గ్రామపంచాయతి నుండి అనుమతులతో నిర్మించుకున్న ఇంటిలో నివాసముంటున్నారని, అయితే వారు ఉద్యోగరిత్యా 15 సంవత్సరాలుగా గోదావరిఖని పట్టణంలో ఉంటున్నారని, పెద్దపల్లి మున్సిపల్ పరిధి బండారికుంటలోని శిథిలావస్థకు చేరుకున్న బొంకూరి లస్మయ్య ఇంటిని తాను కొనుగోలుచేసి నూతనంగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టుతున్న క్రమంలో ఆరెంద వెంకటస్వామి అడ్డుకుంటూ తనపై అసత్య ప్రచారాలు చేస్తూ అధికారులకు తప్పుడూ ఫిర్యాదులు చేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారడని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడిగా చెలామణి అవుతూ ఆరెంద వెంకటస్వామి చేస్తున్న అక్రమ బాగోతాలు ఆధారాలతో బట్టబయలుచేసి చట్టపరంగా పోరాటం సాగిస్తామన్నారు. సమావేశంలో వడ్డెపల్లి రాజు, వడ్డెపల్లి బాలయ్య పాల్గొన్నారు.

నాసిరకంగా బ్రిడ్జి నిర్మాణాలు

రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజయ్య



నవతెలంగాణ - వీర్నపల్లి : నాసిరకంగా బ్రిడ్జి నిర్మాణాలు చేస్తున్నారని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని పెద్ద వాగు బ్రిడ్జి, కంచర్ల బ్రిడ్జి నిర్మాణ పనులను బుధవారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య మాట్లాడుతు.. నాణ్యత లేని మొరం తీసుకువచ్చి నాసిరకంగా బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి నది నుంచి తెచ్చిన ఇసుకనే వాడుతున్నమని, ఎక్కడ చెప్పుకుంటరో చెప్పుకోండి అని కాంట్రాక్టర్ దురుసుగా వ్యవహరించారని చెప్పారు. నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్‌లు కుమ్మక్కై నాసిరకంగా బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వార్త కవరేజ్‌కు వెళ్లిన మీడియాపై కాంట్రాక్టర్ల 'మాకు బడా నాయకుల అండదండలు ఉన్నాయి.. ఎవ్వరు ఏమీ చేయలేరు.. ఏం రాసుకుంటారో రాసుకోండి అంటూ దురుసుగా ప్రవర్తించారు.

ఐఏఎస్ నరహరి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - సుల్తానాబాద్ : పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ వాసి, ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధ్యప్రదేశ్ పరిపాలన మున్సిపల్ కమిషనర్ అండ్ సెక్రటరీలో విధులు నిర్వహిస్తున్న పరికిపండ్ల నరహరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు బొద్దుల సాయినాథ్, దూడం లింగమూర్తి, ప్రవీణ్, రామ్మూర్తి, రామస్వామి, వెంకటరమణ, తిరుమల్‌దాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల విహార యాత్ర

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల చిన్నారి విద్యార్థులను బుధవారం సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ పార్క్‌కు విహార యాత్రకు తీసుకెళ్లారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ లతీఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్, సంతోష్ కుమార్, పిఈటి భరత్ ఉన్నారు.

విశాల సహకార సంఘ భవనానికి భూమిపూజ

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి విశాల సహకార సంఘ నూతన భవన నిర్మాణాన్ని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, కేడీసీసీబీ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు బుధవారం భూమి పూజ చేసి నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సహకార సంఘాలకు నూతన భవనాలు నిర్మించడం జరిగిందన్నారు.దీనితో పాటు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందించే ఉద్దేశంతో సహకార సంఘలా ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చేసామన్నారు. కేడీసీసీబి అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ.. సహకార బ్యాంక్ ద్వారా రైతులకు రుణాలు అందిస్తున్నామన్నారు. రూ.3 కోట్లపై చిలుకు నిధులతో రైతు పండించిన పంటలను నిల్వచేయడానికి గోదాముల నిర్మాణం చేసామన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల సంజయ్ ,సింగిల్ విండో చైర్మన్ తీగల లింగారెడ్డి,వైస్ చైర్మన్ సురుకంటి సంజీవ్‌రెడ్డి, ఎంపీపీ మారుసారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖరరావు, డైరెక్టర్ గోరువంతుల మారుతి ,చర్లపల్లి హనుమాన్‌గౌడ్, జరుపుల రాయల్ నాయక్, గాజా రాజిరెడ్డి, బాల్క సరోజ, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాములు ప్రమీల ,తిరుపతిరెడ్డి , పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

బీజేపీ దలిత మోర్చా మండల అధ్యక్షుడిగా మ్యాకల రమేష్

నవతెలంగాణ-రాయికల్

రాయికల్ మండల బిజెపి దళిత మోర్చా అధ్యక్షుడిగా ధర్మాజీపేట గ్రామానికి మ్యాకల రమేష్,ఉపాధ్యక్షుడిగా ధావన్‌పల్లి గ్రామానికి చెందిన చెలిమేల లోకేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బిజెపి మండల అధ్యక్షులు అన్నవేని వేణు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ.. తమ నియామకానికి సహకరించిన బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు,అసెంబ్లీ కన్వీనర్ మదన్ మోహన్ ,జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల మహేష్,ఎస్టీ మోర్చా అధ్యక్షుడు తిరుపతి నాయక్,దిశ మెంబెర్ గంగాధర్ నాయక్, రామాజీపేట అధ్యక్షుడు చిలివేరి నాగరాజు పాల్గొన్నారు.


నియామక పత్రం అందిస్తున్న అధ్యక్షుడు

పోసానిపేట సర్పంచ్ అవినీతిపై విచారణ

నవతెలంగాణ- కథలాపూర్

కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామ పంచాయతీలో పలు పనులకు సంబంధించి గ్రామ సర్పంచ్ అవినీతికి పాల్పడ్డరంటూ అదే గ్రామానికి చెందిన బత్తుల రాజలింగం ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కాగా ఈ సంఘటనపై బుధవారం డీఎల్ పీవో శంకర్, ఎంపీవో గంగాధర్‌తో పాటు సంబంధితశాఖ అధికారులు పోసానిపేట గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో సదరు సర్పంచ్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అక్రమ ఇసుక దందా చేయడంతో పాటు గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు బిల్లుల డబ్బులను సొంతానికి వాడుకోవడం, గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. విచారణ చేపట్టిన నివేదికను ఉన్నతధికారులకు అందజేస్తామని అధికారులు వెల్లడించారు.


విచారిస్తున్న అధికారులు

ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే సమస్యలు పరిష్కరించాలి

- కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు

నవతెలంగాణ-చొప్పదండి:

పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే రిసిప్ట్ ఇచ్చి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎల్.సు బ్బారాయుడు చొప్ప దండి ఎస్ఐని ఆదేశించారు. చొప్పదండి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ... పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌లో రిజిస్టర్ జీడీ పలు పిటిషన్లను పరిశీలించారు. ప్రతి పిటిషన్ జీడి ఎంట్రీ చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సోదరులతో సానుకూల స్వభావంతో మెదలాలని చొప్పదండి ఎస్ఐ ఉపేంద్రచారికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి గ్రీనరీ మెయింటెన్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్ రావు, చొప్పదండి సీఐ గోపతి రవీందర్, ఎస్ఐ ఉపేంద్రచారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ సుబ్బరాయుడు

గోవా ఇంటర్నేషనల్ అవార్డు 2023 అందుకున్న ఎగ్గేటి శ్రీనివాస్, ఎగ్గేటి శ్రీధర్

నవతెలంగాణ-జమ్మికుంట:

మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన ఎగ్గేటి శ్రీనివాస్, ఎగ్గేటి శ్రీధర్ గోవా ఇంటర్నేషనల్ అవార్డు 2023 అందుకున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి విజయాలు సాధిస్తున్న వారెందరినో వారి సేవలను గుర్తించి కన్నతల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోవాలో నిర్వహించిన మహోత్సవాల వేడుకలో గోవా ప్రముఖులు కన్నతల్లి ఫౌండేషన్ చైర్మన్ రాజన్ బాబు చేతుల మీదుగా ఎగ్గటి శ్రీనివాస్, ఎగ్గేటి శ్రీధర్ బ్రదర్స్ అవార్డును అందుకున్నారు. వీరు ఒగ్గు డోలు కళా రంగంలో ప్రతిభ కనపరిచి అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డు అందుకున్న శ్రీనివాస్, శ్రీధర్‌లను బంధుమిత్రులు, ఆత్మీయులు, గ్రామస్తులు అభినందించారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్

నవతెలంగాణ-చొప్పదండి:

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కంటి వెలుగు ఉచిత శిబిరాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో కంటి వెలుగు ఉచిత శిబిరాన్ని ఎంపీపీ చిలుక రవీందర్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రజలకు పరీక్షలు చేసి అందరికీ కళ్లద్దాలను అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పిడి సౌజన్య శ్యామ్, సుందర్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్యామ కూర శేఖర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, రాజశేఖర్, వైద్య సిబ్బంది. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా న్యాయవాద గుమస్తాల ఎన్నిక

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదుల గుమస్తాల అధ్యక్షుడిగా తాడురి కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొండ్ర సంపత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ..మా ఎన్నికకు సహకరించిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, న్యాయ వాదులు, గుమస్తాలకు కృతజ్ఞతలు తెలిపారు. కలిసి మెలిసి పని చేస్తామని వాగ్దానం చేశారు.

హత్య కేసులో యువకుడికి జీవిత ఖైదీ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం:-

గతంలో జరిగిన హత్య కేసులో యువకునికి జీవిత ఖైదు శిక్ష పడినట్లు ఎస్ఐ ఉమా సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామంలో ఎర్దండి గ్రామానికి చెందిన అవుట్ల శివరాజ్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన అవుట్లా అజయ్, అవుట్ల రాజేష్ అను వ్యక్తులు ఇద్దరు కలిసి అవుట్ల శివరాజును హత్య చేశారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి మెట్పల్లి సీఐ సురేందర్ దర్యాప్తు చేసి చార్జ్ సీట్ దాఖలు చేశారు. సరియైన సాక్షాధారాలు కోర్టు సమర్పించి, కోర్టులో సాక్షాలు ప్రవేశపెట్టి పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ సాక్షాదారాలు నిరుపన కావడంతో నిందితుడైన అవుట్ల రాజేష్ 23 సంవత్సరాలు అను అతనికి జీవితకాల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జ్ నీలిమ తీర్పు ఇచ్చారు. కోర్టులో ప్రవేశపెట్టిన సీఎంఎస్ ఎస్సైని. సెషన్ కోర్ట్ కానిస్టేబుల్ ఇబ్రహీంపట్నం ఎస్సైని ఉన్నత అధికారులు అభినందించారు.

ప్రజా సంక్షేమం పట్టని బీజేపీ ప్రభుత్వం

పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలి

కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

నవతెలంగాణ -మెట్ పల్లి

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి పేదల సంక్షేమం పట్టదని అంబానీ, ఆదానీ, కార్పొరేట్ సంస్థల సంక్షేమమే ముఖ్యమని జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.55 పెంచడం దారుణమన్నారు.ఈ పెంపు ముమ్మాటికీ పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరవడమేనన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు 2014లో 400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు మూడింతలు పెరిగి రూ.1200లకు చేరిందన్నారు. ప్రజల సంక్షేమం గురించి ఎన్నడూ ఆలోచించని కేంద్రంలోని బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ధరల పెంపుకు నిరసనగా పార్టీ ఆదేశాల మేరకు మార్చి 3న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. మహిళలను ఇబ్బంది పెట్టే కార్యక్రమం చేపట్టిన బీజేపికి తగిన బుద్ధి మహిళలే చెపుతారన్నారు. ఈ నెల 4న కోరుట్లలో డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే మేఘ వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చేర్మన్ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కలెక్టర్ ఆర్వీ కర్ణన్

నవతెలంగాణ-కరీంనగర్:

మార్చి 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న కరీంనగర్ పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులకు సూచించారు. కరీంనగర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే (సర్కస్ గ్రౌండ్) పార్కులో పుస్తక మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పుస్తక మహోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. పాఠశాల, కళాశాల, డిగ్రీ కళాశాల, వసతి గృహాల విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పుస్తక ప్రదర్శన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాం ప్రసాద్ లాల్, అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, ఆర్డీఓ ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి రాజ్యలక్ష్మి, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి నేతినియల్, పీడీ మెప్మా రవీందర్, డీఆర్డీఓ శ్రీలత, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జువేరియా, డీడబ్లూఓ సబితా కుమారి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, తహసీల్దార్ సుధాకర్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీకర్ణన్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ వర్కర్స్ ధర్నా

నవతెలంగాణ-కరీంనగర్:

నగరపాలక సంస్థ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్.రూప్ సింగ్, బీఆర్ఎస్ కేవీ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..పెండింగ్ ఏరియాస్‌ను వెంటనే ఇవ్వాలని, కార్మికులపై జవాన్ల అరాచకాలను అరికట్టాలని, కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కార్మికులకు రావాల్సిన పనిముట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కి 11 డిమాండ్లతో కూడిన మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు గడ్డం సంపత్, ప్రధాన కార్యదర్శి మైస తిరుపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాలి శ్రీనివాస్, డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నం లింగయ్య, ప్రధాన కార్యదర్శి మాతంగి లక్ష్మణ్, కోనేటి సమ్మయ్య, సుంకరి లక్ష్మణ్, గస్కంటి శంకర్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

కరీంనగర్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో..

ఈ నెల 3న 'ప్రేరణ - 2023'

కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బరాయుడు

నవతెలంగాణ-కరీంనగర్‌క్రైమ్

నేటి సమాజంలో రాబోవు రోజుల్లో ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడం, యువత, విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన చదువుకోని వారికి మాదక పదార్థాలు, ద్రవ్యాల వినియోగం వాటి దుష్పరిణామాలు, ఆన్ లైన్ మోసాలు, రుణాయాప్‌లు, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ క్రైం, కెరీర్ గైడెన్స్, వివిధ రంగాల్లో సఫలీకృతం అయిన వారి జీవిత విశేషాలపై అవగాన కల్పించి, వారిలో చైతన్యం తీసుకవచ్చేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు ప్రేరణ 2023 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కమిషరేట్ పోలీసులు, ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు, శియా మీడియా సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఈ నెల 3న ప్రత్యక్షంగా ఒకవెయ్యి మంది విద్యార్థులు పాల్గొనే ఈ కార్యక్రమంలో జూమ్ మీటింగ్ విధానం ద్వారా ఒక లక్షమంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. కమిషనరేట్‌లోని మిగతా ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, యువత, గ్రామీణ ప్రాంతాలకు చెందిన చదువుకోని వారు వివిధ విద్యాసంస్థలు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు బుధవారం కమిషరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీసీ వివరాలను వెల్లడించారు. యువతను సన్మార్గంలో పయనింపజేసేందుకు చక్కటి మార్గ నిర్దేశం చేయడం ద్వారా వారిలో ఆలోచన విధానంలో మార్పు తీసుకరావడం, భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్ది సమాజానికి, దేశానికి భవిష్యత్ తరాలను అద్భుతమైన శక్తి వనరులుగా తీర్చిదిద్దాలనే ధృడసంకల్పతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు.

ఈనెల 3న కరీంనగర్ కమీషనరేట్ లోని తిమ్మాపూర్ మండలం అల్గునూరులో గల ఏయంఆర్ ఉన్నది. కన్వెన్షన్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమంలో వెయ్యి మంది విద్యార్థులు ప్రత్యక్ష్యంగా పాల్గొననున్నారు. కమిషనరేట్ లోని డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, పిజి, యంబిఏ, ఎంసీఏ చదువుతున్న విద్యార్థులతోపాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువత, గ్రామీణ ప్రాంతాలకు చెందిన చదువుకోని వారు కూడా ఇందులో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఒక లక్షమంది ఇతర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, యువతను జూమ్ మీటింగ్ ద్వారా భాగస్వాములను చేయడం కోసం వివిధ విద్యాసంస్థలతోపాటు పలు ప్రదేశాల్లో ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల, బీసి సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తోపాటుగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన ఉపన్యాసకులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, మానసికవేత్తలు, ఐఏఎస్, ఐపిఎస్ లాంటి పోటీ పరీక్షలకు శిక్షణలు ఇచ్చే సంస్థలకు, చెందిన అధ్యాపకులు, జీవితంలో ఎన్నో అడ్డంకులను అధిగమించి వచ్చి అద్భుత విజయాలను సాధించిన నిపుణులతో పాటు ప్రముఖ సిని నటుడు రాజేంద్రప్రసాద్, నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్, అనీల్ రాచమల్ల, మిథున్ కుమార్, కె అంకిత్, గంప నాగేశ్వరరావు, కెప్టెన్ మధుసూధన్ రెడ్డి, తోట మురళి తదితులు ఈ కార్యక్రమానికి హాజరై వివిధ రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి (శాంతిభద్రతలు) ఎస్ శ్రీనివాస్, ఏసిపిలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్ రావు, పి ప్రతాప్, ఎస్బిఐ జి వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్లు లక్ష్మిబాబు, దామోదర్ రెడ్డిలతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధంగా ఉండాలి

నవతెలంగాణ-గన్నేరువరం


: పదో తరగతి విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధంగా ఉండాలని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని జంగపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు ఏ విధంగా పది పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యారో తెలుసుకోవడానికి ప్రశ్నలను అడిగి తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు పది పరీక్షలో మెరుగైన ఫలితాలు రావడానికి పలు రకాల సూచనలు, సలహాలను ఇచ్చారు. పది విద్యార్థులకు స్నాక్స్ ఇస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం దేవవరం సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో జనార్ధన్ రావు

మానసాదేవి ఆలయానికి విరాళం అందజేత


నవతెలంగాణ-గన్నేరువరం:

స్వయం భూ మానసాదేవి శక్తి పీఠం ఆలయానికి కొత్తపల్లి మండలం, బావుపేట గ్రామానికి చెందిన రావనవేని కనుకయ్య దంపతులు ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డికి రూ.1 లక్ష వెయ్యి నూట పదహారు రశీదును తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మానసాదేవి అమ్మవార్లపై భక్తులు విశ్వాసంతో ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. శింగిరెడ్డి లక్ష్మారెడ్డి, గడ్డం బుట్టారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ -మెట్‌పల్లి



మెట్‌పల్లి మున్సిపాలిటీకి ఆర్మూర్ మున్సిపల్‌లో పని చేస్తూ బదిలీపై వచ్చిన నూతన కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ బుధవారం నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు, అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, డీఈ రాజ కుమార్, మున్సిపల్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మకపేట గీత కార్మికుల రేణుకాదేవి ఎల్లమ్మ దేవ స్థానంకు టీటీడీ బోర్డు మెంబర్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించి నందుకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, డాక్టర్ సంజయ్‌లకు గీత కార్మికులు పాలాభిషేకం చేశారు. గీత కార్మికుల తరపున ప్రత్యేక ధన్యవాదాలుగౌడ సంఘం కులస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి రాజ్‌గౌడ్, గుమ్మడి రమేష్ గౌడ్, నేరెళ్ల సాయిగౌడ్, సుదం నర్సాగౌడ్, సంటి నర్సయ్య, చింతల నాగయ్య, అక్క బత్తుల శంకర్, సంటి నరేష్, తిగుర్ల రాములు, రెడ్డబోయిన రమేష్, చేగుంట నర్సయ్య సంటి గంగ నర్సయ్య పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-ధర్మపురి

రేపటి నుంచి ప్రారంభం కానున్న ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా టీటీడీ ధర్మశాలలో జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా ఆధ్వర్యంలో అన్ని శాఖ అధికారులతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ జగిత్యాల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, జగిత్యాల జిల్లా ఎస్పీ భాస్కర్, జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ మంద మకరందు, మెట్పల్లి రెవెన్యూ డివిజన్ అధికారి వినోద్‌కుమార్, తహ సీల్దార్ వెంకటేష్, పట్టణ సీఐ బిల్లా కోటేశ్వర్ ఎస్సై కిరణ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

కొండగట్టు ఆలయ చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

- నలుగురి కోసం గాలింపు
- జగిత్యాల ఎస్పీ భాస్కర్

నవతెలంగాణ-జగిత్యాల

కొండగట్టు ఆలయ చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, మరో నలుగురి కోసం గాలిస్తున్నట్టు జగిత్యాల ఎస్పీ భాస్కర్ తెలి పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. కొండగట్టు ఆలయ చోరీ కేసులో ఇప్పటివరకు ముగ్గురు అరెస్టు చేశామని, ఇంకా నలుగురు కోసం గాలింపు చేస్తున్నట్లు తెలిపారు. కొండగట్టు ఆలయంలో జరిగిన దొంగతనం కేసులో నిందితులను 24 గంటలో గుర్తించిన పోలీస్‌సులను అభినందించారు. కొండగట్టుఆలయంలో జరిగిన దొంగతనంలో ముగ్గురు అంతరాష్ట్ర నింది తులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఆంజన్న విగ్రహం, 5కిలోల వెండి ఆభరణాలు రికవరీ చేశారు. మిగితా 10 కిలోల వెండి ఆభరణాలు, దొంగతనంలో పాల్గొన్న మిగతా నలుగురి కోసం 4 బృందాలతో గాలింపు చేపడుతున్నట్లు తెలిపారు. నిందితులు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కి చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా భూమారావు

నవతెలంగాణ-రాయికల్

రాయికల్ మండలం చింతలూరు గ్రామ వేణుగోపాలస్వామి ఆలయం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు.ఆలయ కమిటీ చైర్మన్‌గా వోరుగంటి భూమారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ భూమారావు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్‌గౌడ్, పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ,గ్రామస్థులు రమేష్, పాల్గొన్నారు.

రైతులు పంట రక్షణ చర్యలు చేపట్టాలి

- వ్యవసాయ విస్తీర్ణ అధికారి మత్తయ్య

నవతెలంగాణ-రాయికల్


వరి,నువ్వుల పంటలకు సోకిన తెగుళ్ల నివారణకు రైతులు పంట రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారి మత్త య్య అన్నారు. బుధవారం రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలో వరి,నువ్వు పంటలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి స్వప్నవెంకటేశ్వర రెడ్డి,ఉప సర్పంచ్ బొంగు రాజు, రైతుబంధు సమితి కో-ఆర్డినెటర్ నల్ల పవన్ కుమార్, రైతులు గుమ్మడి భూమయ్య, సంజీవ్, నర్సయ్య,అంబల్ల ప్రతప్ రెడ్డి, పంచాతి అంజన్న తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

మన ఊరు మన బడి పనులు ప్రారంభం

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలోని పెగ్గర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు మన బడి పనులను జడ్పీటీసీ నాగం భూమయ్య బుధవారం ప్రారం భించారు. అదనపు గదుల, పాఠశాల మౌలిక సదుపాయాల కోసం మంజూరు అయిన పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీ బాదినేని రమేష్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఉపసర్పంచ్ జలపతి రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు రఫీ, నాయకులు అంజయ్య, వేణు అధికారులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

కొత్తపల్లి మున్సిపల్‌లో బడ్జెట్ సమావేశం

నవతెలంగాణ-కొత్తపల్లి:

కొత్తపల్లి మున్సిపల్ కార్యా లయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేష్, జేరిపోతుల మొండయ్య సమక్షంలో జీవో నెంబర్ 216 సెక్షన్ 4(2) ప్రకారం బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ బడ్జెట్ 2023-24 సంవత్సరానికి ఎనిమిది కోట్ల ఎనభై లక్షల యాభై వేలు కాగా అంచనా ఆదాయం ఎనిమిది కోట్ల డెభై అయిదు లక్షల ఇరువై నాలుగు వేల అంచనా వ్యయంతో బడ్జెట్ రూపొందించారు. విచ్చలవిడిగా తిరుగుతున్న జంతువులు (కుక్కలు, పందులు, కోతులు) ఇతర జంతువులను నియంత్రించడం కోసం రూ. 6 లక్షల బడ్జెట్ కేటాయి ంచారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు మాట్లాడుతూ.. అభివృద్ధికి సహ కరిస్తున్న పట్టణ ప్రజలందరికీ మున్సిపల్ కౌన్సిల్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


సమావేశంలో చైర్మన్ రుద్ర రాజు

కేసీఆర్‌ను గద్దెదించడానికి

ప్రజలు చైతన్యవంతులు కావాలి

దేశం కోసం మోదీ పని చేస్తే కుటుంబం కోసం కేసీఆర్ పని చేస్తున్నాడు

గ్రామ, పట్టణాలను సైతం అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం

నవతెలంగాణ-గన్నేరువరం:

మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో 'ప్రజా గోస-బీజేపీ భరోసా'లో భాగంగా మండల వ్యాప్తంగా నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి బస్టాండ్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఇన్‌చార్జి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు దరువు ఎల్లన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదని పలుసార్లు అన్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్.. మీ అభివృద్ధి చిట్టా... కేంద్ర ప్రభుత్వం నుండి ఎన్ని నిధులు వచ్చాయో మా చిట్టాతో సిద్ధంగా ఉన్నామని... మీరు ఎక్కడ ప్లేస్ నిర్ణయిస్తే అక్కడికే వస్తామని వసూల్ విసిరారు. రసమయి బాలకిషన్ ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గానికి చేసిందేమి లేదన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని, చైతన్యవంతులయి బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కో ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు తిప్పర్తి నిఖేశ్, మచ్చ బాలరాజు, బూత్ అధ్యక్షులు కుర్ర హరీశ్, గంట గౌతమ్, శేఖర్, వేణు, వెంకటేశ్, సుమంత్, మండల ఉపాధ్యక్షులు మునిగంటి సత్తయ్య, గడ్డం సుమిత్ రెడ్డి, బోయిని మల్లయ్య, బామండ్ల రాజు, లక్ష్మణ్, యువకులు పాల్గొన్నారు.


అతిథులకు బొకేలు అందజేస్తున్న బీజేపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఇన్‌చార్జి డాక్టర్ మల్లారెడ్డి

పేదల కడుపు కొట్టి పెద్దలకు పంచడమే బీజేపీ నైజం

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నవతెలంగాణ-చొప్పదండి:

పేదల కడుపు కొట్టి పెద్దలకు పంచడమే బీజేపీ నైజం అని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. బుధవారం సిలిండర్ ధరల పెంపుపై చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పందించారు. సిలిండర్ ధరల పెంపు దారుణమన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజలనెత్తిన గుదిబండ పెట్టిందన్నారు. సిలిండర్ ధరలు పెంచడానికి కారణం ఏంటో చెప్పాలన్నారు. ఆదాని, అంబానీలకు ప్రజల డబ్బును పంచేందుకు సిలిండర్ ధరలు పెంచారని ఆరోపించారు. 2014లో 400 ఉన్న సిలిండర్ ధర ఈ రోజు రూ.1155లకు పెంచిందని, దీనిపై కేంద్ర మంత్రులు స్మృతి ఇరాని, నిర్మలా సీతారామన్ స్పందించాలని డిమాండ్ చేశారు.

శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల జాతీయ స్థాయి టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్ 'శోధ-2023'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నవతెలంగాణ-తిమ్మాపూర్:

మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో మార్చి నెల 2,3,4 మూడు రోజుల పాటు నిర్వహించబోయే 'జాతీయ స్థాయి టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్ 'శోధ-2023' సందర్భంగా మొదటి రోజు ఈవెంట్స్‌తో పాటు రక్తదాన శిబిరం కూడా నిర్వహించనున్నట్లు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. రక్తదానం వల్ల ఎంతో మంది జీవితాలను కాపాడగలుగుతారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్‌లో వివిధ కళాశాల నుండి అధ్యాపకులు, విద్యార్థులు కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా అందరూ పాల్గొంటారని తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.రవీందర్ మాట్లాడుతూ.. ఫెస్ట్‌లో క్యాడ్ బిల్డ్, ప్రాజెక్టు ఎక్స్పో, ఇన్నోవేటివ్ ఐడియాస్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ మొదలగు సాంకేతిక ఈవెంట్స్‌తో పాటు డ్యాన్సులు, పాటలు, గల్లీ క్రికెట్, రంగోలి, మెహందీ, మిస్టర్ అండ్ మిస్స్ శోధ మొదలగు టెక్నికల్ ఈవెంట్లు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలనాధికారి పారువెల్ల రామారావు, అకాడమిక్ ఇంచార్జ్ డాక్టర్ సి.హెచ్.శశికాంత్, మీడియా ఇంచార్జ్ గొంటి రమేష్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశుమిత్రులకు కనీస వేతనం నిర్ణయించాలి


పసుమిత్ర వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల రమేష్

నవతెలంగాణ-సైదాపూర్:

మండల కేంద్రంలో పశుమిత్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల రమేష్ హాజరయై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది పసుమిత్రులు పని చేస్తున్నారని... ఇప్పటికీ వారికి కనీస వేతనం లేదని తెలిపారు. పశుమిత్రులందరికీ జీవో 60 ప్రకారం రూ.15,600 కనీస వేతనం నిర్ణయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్ వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అనూష, శారద, స్వర్ణలత, స్వప్న, మమత, రజిత, సరోజన, శ్రీవిద్య, రేణుక, వనజ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూంలను పిల్లర్లకే పరిమితం చేశారు

తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర అధ్యక్షులు దాసరి భూమయ్య

నవతెలంగాణ-సైదాపూర్:

మండలంలోని ఎలబోతారం గ్రామంలో పిల్లర్లతోనే ఆగిపోయిన డబుల్ బెడ్రూం ఇండ్లతో పాటు సైదాపూర్ సమీపంలో తెగిపోయిన తుమ్మల చెరువు కట్టను తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర అధ్యక్షులు దాసరి భూమయ్య జిల్లా టీంతో కలిసి సందర్శించారు. అనంతరం దాసరి భూమయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తమ దృష్టికి వచ్చిన వాస్తవాలను ప్రజలకు తెలిపి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడానికే మండలంలో పర్యటించామని తెలిపారు. ఎలబోతారంలో సుమారు 42 డబుల్ బెడ్రూంలు పిల్లర్లకే పరిమితం కావడం అన్యాయమన్నారు. తుమ్మల చెరువు కట్ట తెగిపోవడంతో వందలాది ఎకరాలకు నష్టం జరిగిందని, కట్ట తెగడంతో కింద ఉన్న చెరువులు కూడా దెబ్బతిన్నాయని అవేదన వ్యక్తం చేశారు. కట్ట నిర్మాణం చేపట్టకపోవడంతో నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్రూంలను తక్షణమే పూర్తి చేయాలని, తుమ్మల చెరువుకు మరమ్మతులు చేసి, రైతన్నలకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీన్మార్ మల్లన్న టీంతో ప్రజల తిరుగుబాటు మొదలవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అఖిల్ పాషా, నాగరాజు, టీమ్ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను, తుమ్మల చెరువును సందర్శించిన రాష్ట్ర అధ్యక్షులు దాసరి భూమయ్య

కల్యాణ కానుక అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న సురేందర్ రెడ్డి

నవతెలంగాణ-వీణవంక:

మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన కల్యాణపు వజ్రమ్మ-శంకర్ కుమార్తె శిరీష వివాహం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు గ్రామ సర్పంచ్ గాలేటి జ్యోతి సురేందర్ రెడ్డి హాజరై కల్యాణ కానుకగా రూ.5 వేలు ఆర్థిక సాయంగా వధువుకు అందజేశారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ


గొర్రెలకు నట్టల మందు వేస్తున్న డాక్టర్

నవతెలంగాణ-శంకరపట్నం:

మండల పరిధిలోని కేశవపట్నం గ్రామంలో తెలంగాణ పశువైద్య సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కేశవపట్నం పశువైద్యులు డాక్టర్ జి.భాగ్యలక్ష్మి, బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. నట్టల నివారణ మందు పంపిణీ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచితంగా ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు.

వాహనదారులు త్రైమాసిక పన్ను చెల్లించండి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్



నవతెలంగాణ-తిమ్మాపూర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రవాణా వాహన దారులు త్రైమాసిక పన్ను తక్షణమే చెల్లించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 15 నుండి జరిపిన స్పెషల్ డ్రైవ్‌లో త్రైమాసిక పన్ను చెల్లించని దాదాపు 700 వాహనాలను సీజ్ చేయడమే కాక పన్నుతో పాటు 200 శాతం పెనాల్టీ విధించామన్నారు. వీటి ద్వారా ప్రభుత్వానికి ఒక కోటి 30 లక్షల ఆదాయం సమకూరిందని, స్వచ్ఛందంగా దాదాపు 2000 వాహన దారులు త్రైమాసిక పన్ను చెల్లించారని, వీటి ద్వారా ఒక కోటి 50 లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని ఇప్పటికీ పన్ను చెల్లించని వారు తక్షణమే స్పందించి ఈ సేవలో గాని, మీ సేవలో గాని లేదా రవాణా శాఖ కార్యాలయానికి విచ్చేసి పన్ను చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో తనిఖీల్లో పట్టు బడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు 200 శాతం భారీ జరిమానా విధిస్తామని డీటీసీ చంద్ర శేఖర్ గౌడ్ హెచ్చరించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న జివి రామకష్ణారావు

నవతెలంగాణ-మానకొండూర్:

ఈనెల 6న తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని రాంలీలా మైదానంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధ్యక్షతన జరిగే అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలను విజయవంతం చేయాలని సుడా చైర్మన్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జి.వి రామకృష్ణారావు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సుడా క్యాంపు కార్యాలయంలో మహిళ సంఘం సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా దినోత్సవ వేడుకలకు మహిళలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్ళపెల్లి శేఖర్ గౌడ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు రామంచ గోపాల్ రెడ్డి, ఐకేపీ ఏపీఎంలు సంతోష్, నిరంజన్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి


ప్రత్యేక పూజలు చేస్తున్న రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-ఇల్లందకుంట: అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధర్ చార్యులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి దేవస్థానం స్వామి వారి మెమెంటో అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పత్తి కృష్ణారెడ్డి, సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కవంపల్లి సత్యనారాయణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బలమూరు వెంకట్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ డైరీ యూనిట్లకు ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-గన్నేరువరం: మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం ఎస్సీ అభ్యర్థులకు ఆర్థిక సహాయం కోసం 125 మినీ డైరీ యూనిట్లు కేటాయిస్తూ అర్హులైన ఎస్సీ కుటుంబాల నుంచి ధరఖాస్తులను కోరుతున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం ఎస్సీ అభ్యర్థులు స్థానికంగా ఉండాలి. అభ్యర్థుల వయస్సు 50 ఏండ్లు మించకూడదు. కుటుంబ సభ్యుల్లో ఒకరు మాత్రమే ఆర్థిక సహాయం పొందడానికి అర్హులు. అభ్యర్థులు గత 5 ఏండ్లలోపు ఎటువంటి ఆర్థిక సహాయం పొంది ఉండకూడదు. పాడి పశువులకు పశుగ్రాసం పెంచడానికి 20 గుంటల సాగు భూమిని కల్గి ఉండాలి. అభ్యర్థి సంవత్సర ఆదాయం రూ.1,50,000 మించరాదు. మండలంలోని వివిధ గ్రామాల్లో మినీ డైరీ యూనిట్లు ఆర్థిక సహాయం కోసం 2 మిల్చ్ అనిమల్స్ మొత్తం ధర 2 లక్షలు కాగా సబ్సిడీ రూ.1,40,000 వేలు, బ్యాంక్ లోన్ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు ఫారం, ఫోటో, ఆధార్ కార్డు, కులం, ఆదాయం సర్టిఫికేట్స్, రేషన్‌కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ కాపీలు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని సూచించారు.


క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జడ్పీటీసీ

మా సమస్య వినండి సారూ..

జడ్పీటీసీతో గోడు వెల్లబోసుకున్న మహిళలు

నవతెలంగాణ-శంకరపట్నం:

మండల కేంద్రంలో బుధవారం జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మైపాల్ ఓ కార్యక్రమానికి హాజరవ్వగా అక్కడికి చేరుకున్న ఇందిరమ్మ కాలనీ మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తహసీల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ కాలనీలో ఇప్పటివరకు సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేక కాలనీలో అపరిశుభ్రమైన వాతావరణం నెలకొందన్నారు. గ్రామ పంచాయతీ చెత్త బండి కూడా రాదని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనికి వెంటనే స్పందించిన జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి కాలనీని క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానిక ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను ఆదేశించారు. దీంతో కాలనీవాసులు ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా 'పొన్నం' జన్మదిన వేడుకలు

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన ఉప సర్పంచ్



నవతెలంగాణ-తిమ్మాపూర్:

మండలంలోని మన్నెంపల్లి ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ జన్మదిన వేడుకలు గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఇనుకొండ జితేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ అనిల్ గౌడ్ కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. యువ నేతగా గ్రామానికి, పార్టీకి మరిన్ని సేవలు అందించాలని, మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ..

తన పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని పారిద్య కార్మికులకు ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు తన పుట్టినరోజు సందర్భంగా సాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో వేడుకలు..

మన్నెంపల్లి ఉప సర్పంచ్ పొన్నం అనీల్ గౌడ్ జన్మదినం వేడుకలను మన్నెంపల్లి అంగన్వాడీ కేంద్రంలో యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అరటిపండ్లు, కోడిగుడ్లు అందించారు. కార్యక్రమంలో రైతు బంధు అధ్యక్షులు సయిల్ల కొమురయ్య,మల్లాపూర్ సర్పంచ్ మామిడి సతీష్,గుర్రం జగదీష్,బూడిద కిషోర్, దరిపెల్లి వేణుకుమార్, సుదగోని సదయ్య, బీనపల్లి సంపత్, గికురు రమేష్,గొల్ల సాయి, అసొద సాయి, గట్టుగారి నాగేంద్ర, బీనపల్లి రాజు, బీనపల్లి రాకేష్ , తునికి రాకేష్,బీనపల్లి అజయ్ ,గోల్లే గణేష్, పారునంది అభిషేక్ తదితులున్నారు.

దాడికి పాల్పడ్డ దుండగులను కఠినంగా శిక్షించాలి

బైరి నరేష్‌కు రక్షణ కల్పించాలి

సీపీఎం మానకొండూర్ జోన్ కార్యదర్శి సుంకరి సంపత్



నవతెలంగాణ-తిమ్మాపూర్:

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్‌పై బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, హిందూ వాహిని కార్యకర్తలు దాడి చేయడాన్ని సీపీఐ(ఎం) మానకొండూర్ జోన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని సీపీఎం మానకొండూరు జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుండగులను అరెస్టు చేసి, నరేష్‌కు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణానికి భంగం కల్గించే ఈ తరహా దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ప్రతిఘటించాలన్నారు.

మృతుని కుటుంబానికి బియ్యం అందజేత


బియ్యం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-తిమ్మాపూర్:

మండలంలోని మక్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెనుగొండ రాజయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి కుటుంబానికి.. 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాండ్ల శ్రీనివాస్, చింతం చంద్రయ్య, పాలేటి ఆంజనేయులు, చింతం తిరుపతి పాల్గొన్నారు.

పేదింటి వధువుకు పుస్తె, మట్టెలు అందజేత

నవతెలంగాణ-మానకొండూర్:

మండల కేంద్రానికి చెందిన నిరుపేద దంపతులు కనకం శంకరయ్య-నాగలక్ష్మి కూతురు సరాలదేవి వివాహానికి బీజేపీ మానకొండూరు నియోజకవర్గ ఇంచార్జి గడ్డం నాగరాజు బుధవారం పుస్తె, మెట్టెలతో పాటు 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. అనంతరం వదువును ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధువు కుటుంబ సభ్యులు నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సొన్నాకుల శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు భాషబోయిన ప్రదీప్ యాదవ్, బూత్ అధ్యక్షులు కొండ్ర హరీష్, ఏడెల్లి సంపత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పుస్తె, మెట్టెలు అందజేస్తున్న నాగరాజు